APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com



శంషాబాద్‌లో 3.5 కిలోల బంగారం పట్టివేత

2 లో..




జీఎస్టీ వసూళ్లలో రికార్డు

2 లో..

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | శుక్రవారం | 02 - 05- 2025 | సంపుటి : 15 | సంచిక : 271 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి

# రేవంత్... మార్పు కోరుకున్నారు!



## ఏడాదిన్నర తర్వాత అధికార యంత్రాంగంలో ప్రక్షాళన

- ముఖ్యమంత్రి రేవంత్ టీంలో కీలక మార్పులు
- ఏరికోరి అధికారుల బదిలీలు, బాధ్యతలు
- అనుభవం. అంకితభావం ఉన్న వారికి ప్రాధాన్యత?
- టీటీడీలో పని చేసిన శ్రీనివాసరాజు ఎంపిక వెనుక?
- పెట్టుబడుల ప్రత్యేక కార్యాచరణ అమలుకు మార్పులు?



**ప్రత్యేకప్రతినిధి - నీలగిరివార్త :**

ముఖ్యమంత్రి రేవంత్ పాలనా పరంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యం. అధికార యంత్రాంగ ప్రక్షాళన మొదలు పెట్టారు. తన కార్యాలయం లోనూ మార్పులు చేస్తున్నారు. అనుభవం. అంకిత భావం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. కొందరు అధికారుల తీరు పైన సీఎం రేవంత్ ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. తన అంచనాలకు తగినట్లుగా పని చేసే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని రేవంత్ నిర్ణయించారు. అందులో భాగంగా తాజాగా తన టీంలో ఏరి కోరి ఎంపిక చేసిన వారికి అవకాశం కల్పిస్తున్న నేపథ్యం.

**మార్పులకు సిద్ధమయిన రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్ పాలనలో పూర్తి మార్పులకు సిద్ధమయ్యారు. తాజాగా భారీ స్థాయిలో ఐఏఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం శాఖలవారీగా సమీక్షలు చేస్తోంది. అందులో భాగంగా కీలకశాఖలకు సీనియర్ అధికారులను నియమించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలోనూ మార్పులు చేస్తున్నారు. తన కార్యాలయంలోనూ ప్రక్షాళన ప్రారంభించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన కార్యాలయంలో సీఎం సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించిన సంగీత సత్య నారాయణను వైద్య రోగ్య శాఖ డైరెక్టర్ గా, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా బదిలీ చేశారు.

**పెట్టుబడుల అంశంపై కీలక మార్పులు?**

ప్రభుత్వం పెట్టుబడుల కోసం ప్రత్యేకంగా కార్యాచరణ అమలు చేస్తున్న వేళ పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న జయేశ్ రంజన్ ను సీఎంవోలోకి తీసుకున్నారు. ఆయన కు కీలకమైన పరిశ్రమలు పెట్టుబడులతో పాటు మరికొన్ని కీలక బాధ్యతలు అప్ప జెప్పారు. సీఎం కార్యదర్శిగా వ్యవహారి స్తున్న ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్ రెడ్డిని రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. సీఎం కార్యదర్శిగా వ్యవహరిస్తున్న షానవాజ్ ఖాసింకు ఔషధ నియంత్రణ మండలి డైరెక్టర్ జనరల్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు

మిగతా 4వ పేజీలో..

# ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

- వేవ్స్ సదస్సు ప్రారంభంలో ప్రధాని మోడీ
- హాజరైన చిత్రరంగ ప్రముఖులు



**ముంబై - నీలగిరివార్త :**

భారత్ ఎంటర్‌టైన్ మెంట్ హబ్‌గా మారుతుందని భారత్ ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్ ను మోడీ ప్రారంభించారు. వేవ్స్ సదస్సుకు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సృజనాత్మక హబ్‌గా తయారై కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. సంప్రదాయ, నవతరాలను సమన్వయం చేయాలని సూచించారు. మనదేశంలో 1913లో తొలి చిత్రం రాజా హరిశ్చంద్ర విడుదలైందన్నారు. గేమింగ్ రంగంలో యువతకు అనేక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 50 దేశాల గాయకులు కలిసి వైష్ణవ జనతో గీతం ఆలపించారని పేర్కొన్నారు. ప్రతిభ, సృజనాత్మకతల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయాలని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. నాలుగు రోజులపాటు- ప్రతిష్ఠాత్మకంగా వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ వేవ్స్ జరగనుండగా, ముంబై వేదికగా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్‌లైన్‌తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తుంది. ఇది మీడియా, వినోద పరిశ్రమలను ఒకచోట చేర్చే నాలుగు రోజుల కార్యక్రమం కాగా, ఆ కార్యక్రమానికి మీడియా,

మిగతా 4వ పేజీలో..



# కులగణనను ఏనాడూ పట్టించుకోని కాంగ్రెస్

- తెలంగాణలోనూ తూతూమంత్రంగా సర్వే
- ఎవరో డిమాండ్ చేస్తే తీసుకున్న నిర్ణయం కాదు
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్- నీలగిరివార్త :**

బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆఊసే ఎత్తలేదని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఏ సామాజిక వర్గం వెనకబడి ఉందో గుర్తించవచ్చు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగపడుతుంది. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోంది. అలాంటప్పుడు కాంగ్రెస్ గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదు. ఇది రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదు. సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున

మిగతా 4వ పేజీలో..



# కెటిఆర్‌కు లండన్ ఆహ్వానం

- ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ నుంచి పిలుపు

**హైదరాబాద్- నీలగిరివార్త :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు మరో ప్రతిష్ఠాత్మక సమావే శానికి హాజరుకానున్నారు. జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్య వక్తగా పిలుస్తూ

మిగతా 4వ పేజీలో..

# సమ్మె ఆలోచన విరమించుకోండి

- ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గట్టెక్కుతోంది
- సంస్థను కాపాడుకునే బాధ్యత మనదే
- గత అప్పులకు వడ్డీల కోసం అప్పులు చేస్తున్నాం
- మేడే ఉత్సవాల్లో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్- నీలగిరివార్త :**

ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడండని మేడే వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాలబాటలో పయనిస్తోంది. ఇది మీ సంస్థ.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉంది అన్నారు. గత పదేళ్లలో విధ్వంసం జరిగింది. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీ కొనసాగిందన్నారు. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకండి.. ఏదైనా సమస్య ఉంటే మంత్రిగారితో చర్చించండి.. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం.. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచన చేయండి అన్నారు. అణాపైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లేది లేదు.. మీ కోసమే ఖర్చు చేస్తాం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు.. అందుకే ఒకసారి ఆలోచించండి

మిగతా 4వ పేజీలో..



# తెలుగులో రాసిన వారికి మార్కులెలా ?

- టీజీపీఎస్సీని ప్రశ్నించిన న్యాయస్థానం

**హైదరాబాద్, నీలగిరివార్త :**

తెలుగులో జవాబులు రాసిన వాళ్లకు మార్కులు ఏవిధంగా కేటాయించారని టీజీపీఎస్సీని న్యాయస్థానం ప్రశ్నించింది. ఆయా సబ్జెక్టుల నిపుణులు మూల్యాంకనం చేసి

మిగతా 4వ పేజీలో..

# విస్తృతస్థాయిలో భూభారతికి దరఖాస్తులు

- నాలుగు పైలట్ మండలాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి
- రాష్ట్రంలో 555 మండలాల్లో ప్రజలకు చట్టంపై అవగాహన
- రైతుల నుండి భూ సమస్యలపై 11, 630 దరఖాస్తుల స్వీకరణ
- పీపీబీకి సంబంధించి 3,446, సాదా బైనామాలపై 2,796 దరఖాస్తులు
- రెవెన్యూ సమస్యల మార్పుకు నాంది భూభారతి : మంత్రి పొంగులేటి




**ప్రత్యేకప్రతినిధి - నీలగిరివార్త :**

నాలుగు పైలట్ మండలాల్లో గల 72 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి, 555 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తి, భూ సమస్యలపై 11, 630 దరఖాస్తుల స్వీకరణ్ణ ఈ నెల 5వ తేది నుంచి జిల్లాకు ఒక మండలం చొప్పున 28 మండలాలలో భూ భారత్ని 20 జిల్లాల్లో 45 సదస్సుల్లో స్వయంగా పాల్గొన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. తెలంగాణరాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా గత నెల14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఏమాత్రం ఆటంకం కలగకుండా ఉండేలా పైలట్‌గా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, నారాయణపేట్ జిల్లా మద్దూర్, ములుగు జిల్లా వెంకటాపూర్ నాలుగుమండలాల్లో

మిగతా 4వ పేజీలో..

# రైతులను పారిశ్రామికవేత్తలను చేస్తా

- మహిళలు కూడా అన్నిరంగాల్లో రాణించాలి
- యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి
- 175 నియోజకవర్గాల్లో చిన్నతరహా పరిశ్రమలు
- నెల్లూరు పర్యటనలో సీఎం చంద్రబాబు వెల్లడి



**నెల్లూరు- నీలగిరివార్త :**

రైతుల్ని పారిశ్రామిక వేత్తలను చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త ఉండాలని, దీనిని సాధించేందుకు అండగా ఉంటామన్నారు. మహిళలు కూడా పరిశ్రమలు పెట్టి ఆదాయాన్ని ఆర్జించాలని, మహిళలను కూడా అన్ని విధాలా ప్రోత్సహిస్తామన్నారు. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి యువత ఎదగాలని అన్నారు. పారిశ్రామిక పార్కులలో పరిశ్రమలను తెచ్చే బాధ్యత ఎమ్మెల్యేలదే అని, పరిశ్రమలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. యువత ఆలోచనా విధానంలో మార్పు రావాలిని .. ఉద్యోగాలు చేయడం కాదు, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి యువత ఎదగాలని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రజావేదికపై సీఎం మాట్లాడారు. అమరావతిలో భూములు ఇచ్చిన వారికి ప్లాట్లను అభివృద్ధి చేసి ఇస్తున్నాం, దీనివల్ల వారు కోటీశ్వరులు అవుతారు. ఎన్నో విద్యా సంస్థలకు భూములు ఇచ్చాం. నేను చేపట్టిన ఎన్నో ప్రాజెక్టులకు సంబంధించి ఏ రైతుకూ అన్యాయం చేయలేదు. అభివృద్ధిని సహించలేని కొందరు ఇబ్బందులు పెడుతున్నారు. నెల్లూరు జిల్లాలో తరతరాలుగా వెనుకబడిన యానాది కుటుంబాలను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కులను ఏర్పాటు చేస్తాం. వీటిలో పరిశ్రమలను తీసుకువస్తాం. వ్యవసాయం తర్వాత పారిశ్రామిక రంగంలో కూడా ఉపాధి అధికంగా లభిస్తుందన్నారు. ఈ పార్కులలో పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం. గతంలో నేను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ప్రాధాన్యమిచ్చాను. దానివల్ల ఎందరికో ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుతం ఏఐ వచ్చింది, భవిష్యత్తు కూడా దీనికే ఉంటు-ంది. రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ కింద అమరావతిలో కేంద్రాన్ని

మిగతా 4వ పేజీలో..

# జిఎస్టీ వసూళ్లలో రికార్డు

గతేడాదిని మించి వసూళ్లు

**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** జీఎస్టీ వసూళ్లు ఏప్రిల్ నెలలో రికార్డు సృష్టించాయి. గడిచిన నెలలో ప్రభుత్వానికి జీఎస్టీ వసూళ్లు రికార్డ్ స్థాయిలో వచ్చాయి. మే 1న విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్ నెలలో జీఎస్టీ రూపంలో రూ.2.37లక్షల కోట్లు వసూలయ్యాయి. అంతకు ముందు నెలలో అంటే మార్చిలో రూ.1.96 లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి. గతేడాది ఏప్రిల్ నెలలో ప్రభుత్వం రూ.2.1 లక్షల కోట్లు జీఎస్టీ కింద వసూలు చేసింది. వార్షిక వసూళ్ల స్పీడు 12.6 శాతంగా ఉండటం అంటే, 17 నెలల్లో ఇదే గరిష్టం. ఆర్థిక వ్యవస్థకు వినియోగం కూడా తోడవడంతో త్రైమాసిక వసూళ్లు 2025 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ .5.75 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశీయ లావాదేవీల నుంచి జీఎస్టీ ఆదాయం 10.7 శాతం పెరిగి రూ.1.9 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకున్న వస్తువుల ఆదాయం 20.8 శాతం పెరిగి రూ.46,913 కోట్లకు చేరింది.

# శంషాబాద్‌లో 3.5 కిలోల బంగారం పట్టివేత

**హైదరాబాద్- నీలగిరివార్త :** శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారం పట్టివేసారు. మస్కట్ నుంచి వచ్చిన విమాన సిబ్బంది వద్ద బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మస్కట్ నుంచి బంగారం తెచ్చి గ్రౌండ్ స్టాఫ్ కు ప్యాసింజర్లు అందించారు. ఎయిర్ పోర్ట్‌నుంచి బంగారాన్ని బయటికి తీసుకొచ్చేందుకు గ్రౌండ్ స్టాఫ్ ప్రయత్నించగా.. 3.5 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. బంగారం స్మగ్లర్ కి సహకరించిన గ్రౌండ్‌స్టాఫ్‌ని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి పార్కింగ్ వరకు బంగారం తీసుకొచ్చి అప్పగిస్తుండగా పట్టు-కుని.. 3.5 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. వేశారు.

# కెటిఆర్‌కు లండన్ ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

ఆ సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే థీమ్‌తో ఈ సంవత్సరం ఈసదస్సును నిర్వహిస్తున్నట్టు ఆక్స్ ఫర్డ్ ఇండియా ఫోరం వ్యవస్థాపకులు సిద్ధార్థ్ సేథీ తెలిపారు. కెటిఆర్ తన అనుభవాలను, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులతో పంచుకుంటే చర్చలు మరింత ఆసక్తికరంగా ఉంటడంతోపాటు భారతదేశఅభివృద్ధి ప్రస్థానంలో భాగం అవ్వడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని సిద్ధార్థ్ సేఠీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంతో పాటు భారత్ లోని స్థిరమైన అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా వక్తలు చర్చిస్తారు. వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణుల సమక్షంలో భారతదేశ ప్రగతిపథాన్ని,తెలంగాణలో అమలుచేసిన వినూత్న విధానాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి మోడల్‌ను కేటీ-ఆర్ వివరించనున్నారు. ఈ సదస్సులో కేటీఆర్ పాల్గొంటే రాబోయే రోజుల్లో ప్రపంచంపై ఇండియా చూపే సానుకూల ప్రభావాన్ని, నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి బలంగా చాటొచ్చని సిద్ధార్థ సేఠి తెలిపారు. ఈ ఆహ్వానాన్ని స్వీకరించి, సదస్సుకు రావాలని సిద్ధార్థ్ కోరారు. ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సమావేశం యూరప్‌లో భారత్‌కు సంబంధించిన అతి పెద్ద కార్యక్రమం. భారతదేశ పురోగతి, ఆవిష్కరణలను ప్రపంచానికి చూపే వేదిక. మనదేశ అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మార్పులు, గ్లోబల్ సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి. భారత్‌ను ప్రపంచానికి దగ్గర చేయడం, పరిశోధన, సాంకేతికత, విధానాల్లో ఇతర దేశాల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ ఫోరమ్ ప్రధాన లక్ష్యం.

# విస్తృతస్థాయిలో భూభారతికి దరఖాస్తులు

మొదటి పేజీ తరువాయి

పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఇదే సమయం లో ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి రోజు ఒక మండలంలో రెండు గ్రామాల్లో అవగాహనసదస్సులు నిర్వహిస్తోంది ఈ రెండుసదస్సుల్లో కలక్టర్లుస్వయం గా పాల్గొనాలని ఆదేశించింది. ఇందుకోసం మండల స్థాయిలో తహశీల్దార్ డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో రెండు బృందాలను ఏర్పాటు చేసింది.ఈ భూభారతి చట్టం రైతులకు అర్ధమయ్యే విధంగా చట్టాన్ని అమలు చేసే అధికారులకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులు నిర్వహించింది. భూభారతి చట్టంలో కీలక పాత్ర వహించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి ఒక సవాల్‌గాతీసుకొని విస్తృత స్థాయిలో జిల్లాల్లో పర్యటించి రోజుకు రెండు, మూడు అవగాహనా సదస్సులలో స్వయంగా పాల్గొన్నారు. ఏప్రిల్ 17వ తేదీనుంచి 30వ తేదీ వరకు దాదాపు20 జిల్లాల్లో సుమారు 45 సదస్సులలో పాల్గొన్నారు. నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో ఏప్రిల్ 17 వ తేదీ నుంచి 30వ తేదీవరకు రెవెన్యూ సదస్సుల్ని పూర్తిచేశారు.ఈ సదస్సు ల్లో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే మరోవైపు ఆయా మండలాల్లో భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రశీదు అందజేశారు. ఒక ప్రత్యేక ఫార్మాట్ లో తయారు చేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సుకు ముందు రోజే ప్రజలకు అందించారు.లింగంపేటలో 3,702, వెంకటాపూర్‌లో 3,969, మద్దూర్‌లో 1,341, నేలకొండపల్లిలో 2,618 మొత్తం 11,630 దరఖాస్తుల్ని స్వీకరించారు. ఇందులో ప్రధానంగా పీపీబీకి సంబంధించి 3,446, సాదా బైనామాల పై 2,796 దరఖాస్తులు వచ్చాయి.వచ్చిన దరఖాస్తులన్నిటిని ఏరోజుకు ఆరోజు కంప్యూటర్ లో నమోదుచేసి సంబంధిత అధికారుల కు పంపించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఈ సదస్సుల్లో పాల్గొ న్నారు. హైదరాబాద్ మినహా 605 మండలాలకు గాను 555 మండలా లలో బుధవారం నాటికి సదస్సులు పూర్తి అయ్యాయి.వచ్చిన దరఖాస్తు లను క్షుణ్ణంగా పరిశీలించి జూన్ 2వ తేదీ నాటికి ఆ నాలుగు మం డలాల్లో భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# తెలుగులో రాసిన వారికి మార్కులెలా ?

మొదటి పేజీ తరువాయి

మార్కులు కేటాయించారని సర్వీస్ కమిషన్ తరఫున లాయర్ తెలిపారు. ఇదే కేసులో బుధవారం కూడా విచారణ జరగగా గురువారం మరోమారు హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నామవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తమిళనాడులో ప్రజలకు ఎన్ని భాషలు వచ్చినా తమిళంలోనే మాట్లాడతారని, ఇక్కడమాత్రం ఆంగ్లంలో మాట్లాడిన వారికే ఎక్కువ మర్యాద ఇస్తారని అన్నారు. 'ఇది నా స్వీయ అనుభవం కూడా. తెలుగులో గ్రూప్-1 పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వచ్చాయన్నది ప్రధాన ఆరోపణ. దీనికి కారణమేమిటో స్పష్టత ఇవ్వాలన్నారు. మెయిన్స్ మూల్యాంకనంలో అనుసరించే ప్రాతిపదిక, మార్కుల కేటాయింపు విధానంపై వివరణ ఇవ్వాలని టీ-జీపీఎస్సీని ఆదేశించారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ పలువురు అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. పరీక్షా కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోసారి మూల్యాంకనం చేసేలా టీజీపీఎస్సీని ఆదేశించాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. టీ-జీపీఎస్సీ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. కొంతమంది అభ్యర్థులు మెయిన్స్ ఫలితాలపై అపోహపడుతున్నారని కోర్టుకు తెలిపారు. నిపుణుల పర్యవేక్షణలోనే మూల్యాంకనం జరిగిందని వివరించారు.

# కులగణనలో తెలంగాణ రోల్ మాడల్

- మా అనుభవాన్ని ఉపయోగించుకోండి
- మేం అనేక రకాలుగా కసరత్తు చేసి అనుభవం పొందాం
- రాహుల్ డిమాండ్‌కు కేంద్రం తలొగ్గక తప్పలేదు
- రాష్ట్రం యూనిట్‌గా కులగణన చేపట్టాలి
- పలు రకాల కమిటీలు వేసి స్పష్టంగా ముందుకు వెళ్లాలి
- ఏడాది కాలపరిమితిలో గణనను పూర్తి చేయాలి
- మీడియా సమావేశంలో కేంద్రానికి సిఎం రేవంత్ సూచనలు



**హైదరాబాద్- నీలగిరివార్త :**

కులగణనలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని, రాహుల్ డిమాండ్‌కు కేంద్రం తలొగ్గక తప్పలేదని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ మార్గనిర్దేశం ప్రకారం, తెలంగాణలో కుల గణనను సక్రమంగా నిర్వహించి, దేశానికి ఒక మోడల్‌గా నిలిపింది. గురువారం సిఎం మీడియాతో మాట్లాడారు. కేశవరావు, మధుయాష్కీలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని యూనిట్‌గా కుల గణన చేయడం అత్యంత అవసరం అని చెప్పారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం, వర్గం ఉందని ఆయన వివరించారు. ఆయన చేసిన సర్వే 8 పేజీల ప్రశ్నావళి ద్వారా రూపొందించబడింది. ఈ సర్వేలో ప్రైవసీ యాక్ట్‌ను కూడా అనుసరించామని, 95 వేల మంది ఎన్యూమరేటర్లను నియమించి, సర్వే మానిటరింగ్ కోసం సూపర్ వైజర్లు నియమించామని తెలిపారు. సర్వేలో 3 శాతం మంది పాల్గొనకపోవడం వల్ల తిరిగి వారికి అవకాశం ఇచ్చామనీ, తెలంగాణ మోడల్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి మోడీకి రేవంత్ రెడ్డి సలహా ఇస్తూ...కేబినెట్ మంత్రులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి, టర్మ్ ఆఫ్ రిఫరెన్స్‌ను రూపొందించండని ఆయన పేర్కొన్నారు. అలాగే, కుల గణనను సమాజానికి ఎక్స్-రే లాంటిదిగా భావించారు, దీనికి సంబంధించిన ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేయాలని రాహుల్ గాంధీ సూచించారు. మేము 57 ప్రశ్నలు 8 పేజీల ప్రశ్నావళిలో రూపొందించాం. ప్రజల సమాచారాన్ని గోప్యంగా ఉంచాము. కేవలం ఆయా కులాల పర్సంటేజ్ మాత్రమే ఇచ్చామని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం దీనికి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, కుల గణనకు ముందు వచ్చిన కేంద్రానికి అభినందనలు తెలిపారు. జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కేంద్రం నిర్ణయంపై రాజకీయాలు మాట్లాడదల్చుకోలేదని వెల్లడించారు. కుల గణనపై తెలంగాణ రాష్ట్రానికి అవగాహన ఉందన్నారు. కుల గణన కోసం దేశ వ్యాప్తంగా ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం ఒక్కో జాబితాలో ఉందని తెలిపారు. కుల గణన కోసం మంత్రులతో ఒక కమిటీ ఏర్పడి చేయాలని.. అధికారులతో, నిపుణులతో ఒక కమిటీ వేసి అధ్యయనం చేయాలని సూచించారు. కులగణన కోసం తెలంగాణ మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కేంద్రానికి తెలిపారు. మంత్రుల కమిటీ- వెంటనే నియమించాల న్నారు. మంత్రుల కమిటీకి తోడుగా నిపుణుల కమిటీని వేయాలన్నారు. ఈ రెండు కమిటీలతో దేశవ్యాప్తంగా అధ్యయనం చేయించాలని తెలిపారు. అలాగే ఈ వ్యవహారమంతా ఏడాదిలోగా పూర్తి చేయించాలన్నారు. తాము ప్రజల నుంచి, ప్రజా సంఘాల నుంచి అనేక విషయాలు, సూచనలు తీసుకొని కులగణన చేశామన్నారు. కుల గణన కోసం 95,000 ఎన్యూమరేటర్లను నియమించామని.. పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్‌ను నియమించినట్లు- చెప్పారు. మంత్రుల కమిటీ- ఎప్పటికప్పుడు పర్యవేక్షించిందన్నారు. కుల గణన చేసిన తర్వాత పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని.. కుల గణనలో పాల్గొనని వాళ్ళకి మరోసారి అవకాశం ఇచ్చామన్నారు. మూడు నెలల్లోనే ఎలాంటి ఇబ్బందులు రాకుండా కుల గణన చేశామని తెలిపారు. కుల గణన విషయంలో కేంద్రంతో కలిసి నడవడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కుల గణన విషయంలో కేంద్రానికి వచ్చే సందేహాలకు సమాధానం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు- తెలిపారు. 1931 తర్వాత కుల గణన చేసింది తెలంగాణ ప్రభుత్వమే అని అన్నారు. కుల గణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి అన్ని రకాలుగా మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. కుల గణన ఎప్పుడూ మొదలు పెడతారో మోదీ చెప్పాలన్నారు. ఎప్పటి లోగా కుల గణన చేస్తారని ప్రశ్నించారు. కుల గణన సీక్రెట్ డాక్యుమెంట్ కాదని.. కుల గణన విధివిధానాలు బయట పెట్టాలన్నారు. 50 శాతం పరిధి పెంచి రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు పెట్టి ఆమోదించామన్నారు. తెలంగాణ బలహీన వర్గాల తరపున రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలియజేశారు. రాహుల్ సూచనల మేరకు కుల గణన నిర్వహించామని.. కుల గణన క్రెడిట్ రాహుల్ గాంధీదే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. తాము కులగణనపై దేశానికి మార్గదర్శకంగా నిలిచామని స్పష్టం చేశారు. దేశంలోని అనేక పార్టీలు కులగణన కోరుతున్నాయని, కులగణన చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాయని అన్నారు. తెలంగాణలో బీసీలుగా ఉన్న బోయలు.. కర్ణాటకలో మరో వర్గంలో ఉన్నారు. రాష్ట్రంలో 8వేల పేజీల్లో 57 ప్రశ్నల ద్వారా మేం వివరాలు సేకరించాం. కులగణన విషయంలో తెలంగాణ అనుభవం కేంద్రానికి ఉపయోగపడుతుంది. ఎన్యూమరేటర్ నుంచి సీఎస్ వరకు పలుమార్లు సమీక్ష నిర్వహించాం. అనేక సలహాలు, సూచనలు వచ్చాయి. టోల్‌ఫ్రీ నంబర్ ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించాం. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా కులగణన చేపట్టాం. తెలంగాణ మోడల్ తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం. అన్ని రాష్ట్రాలకు నిపుణుల కమిటీని పంపాలి. ప్రతి రాష్ట్రంతో మాట్లాడి ఆయా ప్రభుత్వాల సూచనలు తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. కులగణన పూర్తయ్యాక ఏం చేస్తారో స్పష్టంగా చెప్పాలని కేంద్ర ప్రభుత్వానికి రేవంత్ సూచించారు.

# కులగణనను ఏనాడూ పట్టించుకోని కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి

కులగణన నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్‌లా.. ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయం. తెలంగాణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూమంత్రంగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదు' అని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోడీ నేతృత్వంలో క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో జరగబోయే జనగణనలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.. ప్రధానికి హృదయపూర్వక ధన్యవాదాలు.. దేశంలో సానుకూలమైన మార్పుకు, కులగణన.. చరిత్రాత్మకమైన కులగణన,చరిత్ర పుటల్లో నిలిచిపోనుంది అన్నారు. ప్రతిపక్ష పార్టీలు నాటకాలకు తెరలేపుతున్నారు.. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లకు సంబంధించి, కుట్రలు కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. అలాగే, ముస్లింలను తీసుకెళ్లి బీసీల్లో చేర్చడం దారుణం.. కాంగ్రెస్ అన్ని తప్పుడు నిర్ణయాలు చేసింది.. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ రాష్ట్రపతుల అభ్యర్థిత్వాలను వ్యతిరేకించింది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మోడీ సర్కార్ ఎన్నో ఏళ్ల పెండింగ్ అంశం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టుకు తమ వైఖరిని స్పష్టం చేశాక.. వర్గీకరణ అంశంపై కోర్టు కీలక తీర్పు ఇచ్చింది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మోడీనీ కులం పేరుతో దూషించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. కాంగ్రెస్ మొదటి నుంచి బీసీల పట్ల మొసలి కన్నీరే కార్చింది.. 2018లో మోడీ ప్రధాని అయ్యాక బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్దంగా చట్టం చేశారు.. అన్ని వర్గాలకు న్యాయం చేయ్యాలని.. ఆర్థికంగా వెనకబడిన వర్గాల కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది మోడీ ప్రభుత్వం అని కిషన్ రెడ్డి అన్నారు. కాగా, మహిళల సాధికారిత కోసం 35 శాతం రిజర్వేషన్లు కల్పించామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ముస్లిం మహిళల కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేసి.. వాళ్లకు న్యాయం చేసింది మోడీ సర్కార్.. 1981 నుంచి 1931 వరకు కులగణన జరిగింది.. ఆ తర్వాత కులగణ జరక్కుండా కాంగ్రెస్ వ్యవహరించింది.. కులగణనకు కాంగ్రెస్ వ్యతిరేకం అని మండిపడ్డారు. మండలి కమిషన్ నివేదికను రాజీవ్ గాంధీ వ్యతిరేకించారు.. 2010లోనే సుష్మాస్వరాజ్ కుల గణన అంశాన్ని లేవనెత్తారు.. సామాజికంగా అన్ని వర్గాలకు లబ్ధి జరగాలి అని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా.. దేశ హితం కోసమేనన్నారు. న్యాయస్థానాల తీర్పుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది.. మేం చేసే కులగణనలో మతం ప్రాతిపది కన ఏ మతాలను బీసీల్లో చేర్చేది లేదు అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు.

# సమ్మె ఆలోచన విరమించుకోండి

మొదటి పేజీ తరువాయి

అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన మేడే వేడుకల్లో సిఎం పాల్గొని ప్రసంగించారు. కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మె పోటు రాష్ట్రానికి నష్టం చేస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది.. మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుంది.. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దు.. వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు అని సూచించారు. ఆర్టీసీ కార్మికులు నన్ను నమ్మండి.. నమ్ముకున్న మీకు అండగా ఉంటాను అని చెప్పుకొచ్చారు. వారానికి ఒకరోజు సెలవు.. కార్మికుల పోరాట ఫలితమే అన్నారు. ఇక, తెలంగాణలో ఆర్థిక మాంద్యం తక్కువ ఉందన్నారు. సింగరేణిలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు మొదటి సారి మనమే బోనస్ ఇచ్చాం.. సింగరేణిని పదేళ్లు నిర్వీర్యం చేశారు .. కారుణ్య నియామకాలు సరళీ కృతం చేశాం.. ఒక కుటుంబమే 7 లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపించారు. కార్మికుల పట్ల ఎప్పుడైనా అనుకూలంగా మాట్లాడారా వాళ్ళు.. లక్ష రెండు వేల కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లకు ఇచ్చాడు.. కానీ కట్టిన మూడేళ్లకే కూలి పోయింది అని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన అప్పులు కట్టడానికి లక్ష రెండు వేల కోట్లు- అప్పు తెచ్చిన.. వడ్డీలు కట్టడానికే సరిపోతుంది.. ఏ పథకం అయినా ఆగిందా?.. అని ముఖ్యమంత్రి రేవంత్ ప్రశ్నించారు. ఇక, ఖజానా అంతా లూటీ చేసినా ఏ పథకం ఆగలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పేద ప్రజల ఇండ్లో సన్న బియ్యం ఇస్తున్నాం.. గుజరాత్ లో కూడా ఏడాదిలో 58 వేల ఉద్యోగాలు ఇచ్చారా?.. నేను ఇచ్చిన.. మనం దివాలా తీశాం.. కేసీఆర్ కుటు-ంబం మాత్రం కోట్లు- వెనకేసు కున్నారు అని ఆరోపించారు. గతంలో మీ ఫోన్ లు స్వేచ్ఛగా మాట్లాడుకున్నారా.. ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడుకుంటు-న్నారు.. స్వేచ్ఛ, సంక్షేమం ఇచ్చినం మేమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఆర్టీసీ కార్మికులు పంథానికి పోకండని సూచించారు. మిమ్మల్ని ఆదుకుంటాం.. మీ సమస్యలు మంత్రితో మాట్లాడండి.. లేదంటే నా దగ్గర ఉన్న ఖజానా మీకు ఇస్తా.. మీరే చూసి చెప్పండి అన్నారు. బడ్జెట్ పద్మనాభం లాగా తయారైంది నా పరిస్థితి అని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# రైతులను పారిశ్రామికవేత్తలను చేస్తా

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేస్తున్నాం. అదేవిధంగా విశాఖ, రాజమండ్రి, విజయ వాడ, తిరుపతి, అనంతపురంలలో రీజనల్ హబ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యాసంస్థలను, పరిశ్రమలను అనుసంధా నం చేస్తున్నాం. దీనివల్ల ఎందరికో ఉపాధి వస్తుంది. యువత ఆలోచనా విధానంలో మార్పు రావాలి. విదేశాల్లో తెలుగువాళ్లు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త ఉండాలి. దీనిని సాధించేందుకు అండగా ఉంటాం. సింగల్ విండో కింద రుణాలు, సబ్సిడీ ఇస్తాం. పారి శ్రామిక రంగంలో కొత్త విధానానికి శ్రీకారం చుట్టాం. పరిశ్రమల్లో ఉత్పత్తుల మార్కెటింగ్ కు కూడా ప్రభుత్వం సహకారం అంది స్తుంది. పారిశ్రామిక పార్కులలో పరిశ్రమ లను తెచ్చే బాధ్యత ఎమ్మెల్యేలదేనని అన్నారు. పరిశ్రమలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం. పారిశ్రామికవేత్తలను ఎవరూ బెది రించకుండా చూసుకోవాలి. ఒక్కో పార్కుకు రూ.10-15 కోట్ల మేర నిధులు ఇస్తాం. వీటితో పాటు- ఐదు నుంచి పది ఎకరాలలో నానో పార్కులను కూడా ఏర్పాటు చేస్తాం. రైతులు కూడా పారిశ్రామికవేత్తలుగా మార వచ్చు, అదే మా లక్ష్యం అని సీఎం అన్నారు. మహిళలు కూడా పరిశ్రమలు పెట్టి ఆదాయాన్ని ఆర్జించాలి. మహిళలను కూడా అన్ని విధాలా ప్రోత్సహిస్తాం. రాష్ట్ర రాజధాని ఏదంటే ప్రజలు మా అమరావతి అనే చెప్పుకోవాలి. రామయ్య పట్నం పోర్ట్ వద్ద పరిశ్రమలు వస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం. దగదర్తిలో విమానాశ్రయ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్ గా మారుస్తాం. ఇలా రాష్ట్రమంతా అభివృద్ధి చేయాలనేదే నా ఆలోచన. ఆత్మకూరు నియోజకవర్గానికి సోమశిల నీటిని ఇచ్చే బాధ్యతను తీసుకుంటాం. తెలుగుదేశం పార్టీ జిల్లాలో చాలా కార్యక్రమాలు చేసింది. అందువల్లే నెల్లూరులో పది స్థానాల్లోనూ టీడీపీని గెలిపించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలను ఆత్మకూరులో పెడతాం. అభివృద్ధి ఫలాలు పేదలకు అందాలి, పేదల జీవితాల్లో మార్పు రావాలి. పెన్షన్లను కూడా పెంచాం, విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లను కూడా పెంచిన పార్టీ టీడీపీనే. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇవ్వనన్ని పింఛన్లను మన రాష్ట్రం ఇస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. ఇకపోతే ప్రపంచంలో ఎక్కడకి వెళ్లినా..నా రాజధాని అమరావతి అని ప్రతి ఒక్కరు చెప్పుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. నెల్లూరు జిల్లాలో ఎంఎస్‌ఎంఈ పార్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించారు. అలాగే వర్చువల్‌గా 11 ఎంఎస్‌ఎంఈ పార్కులను సీఎం మొదలుపెట్టారు. 14 ఎఫ్‌ఎఫ్‌సీలు,25 ఎంఎస్‌ఎంఈ పార్కులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం దగదర్తిలో త్వరలోనే ఎయిర్ పోర్టు పనులు ప్రారంభించి, త్వరగా పూర్తి చేస్తామన్నారు. పోర్టులు,రైల్వే లైన్లు, నేషనల్ రోడ్లు వస్తాయన్నారు. ఇప్పటికే చాలా పరిశ్రమలు వచ్చాయి. ఇంకా పరిశ్రమలు వస్తాయన్నారు. సోమశిల నీరు ఆత్మకూరుకి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రి ఆనం, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# మెప్మాపై విచారణ ఏది..

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి :**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మెప్మా అవినీతి పై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ నిర్వహించాలని ఆదేశాలు వచ్చి నెలలు గడుస్తున్న నేటికి విచారణ జరగకపోవడం గమనార్హం. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు పెద్దపీట వేస్తూ మెప్మా అధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయడం సంఘాల సభ్యుల అధ్వర్యంలో పొదుపు చేయడం తెలిసిందే. బ్యాంక్ రుణాలు మంజూరు కావడంలో బ్యాంక్ అధికారులతో లోపాయికారీ ఒప్పందాలు చేయడంలో సంవత్సరాల తరబడి తిష్ట వేసుకున్న మెప్మా టీఎంసీ, తాత్కాలిక టీఎంసీలు, వారి ముఖ్య సిబ్బంది పై జిల్లా వ్యాప్తంగా ఆరోపణలు ఉన్నాయి. పొదుపు సంఘాల అధ్వర్యంలో జరిగే క్రయవిక్రయాలలో పెద్ద ఎత్తున అవినీతి గోల్ మాల్ జరుగుతుండటం ఆనవాయి తీగా మారింది. మరికొన్ని చోట్ల సభ్యుల ముక్కు పిండి డబ్బు లు వసూలు చేయడం జరుగుతున్న బాధ్యత గల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని బహిరంగ ఆరోపణలు లేకపోలేదు. ఉమ్మ డి జిల్లాలో పలు చోట్ల విచారణ చేపట్టాలని ఆదేశాలు వచ్చినప్పటికీ స్థానిక ప్రజాప్రతి నిధుల కనుసన్నల్లో విచారణకు కళాదోషం పట్టినట్లు తెలుస్తుంది.

# రేవంత్.. మార్పు కోరుకున్నారు!

మొదటి పేజీ తరువాయి

జారీ చేశారు. ఇక, తాజాగా టీటీడీలో సుదీర్ఘకాలం పాటు జేఈవోగా వ్యవహరిం చిన కేఎస్ శ్రీనివాసరాజును ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శిగా నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.

**శ్రీనివాస రాజు ఎంపిక వెనుక?**

టీటీడీలో సుదీర్ఘ కాలం శ్రీనివాస రాజు పని చేసారు. రెండేళ్ల పాటు శ్రీనివాస రాజు ఈ పదవిలో కొనసా గనున్నారు.ఏపీ నుంచి రిలీవ్ ఐన శ్రీనివాస రాజు తెలంగాణలో రిపోర్ట్ చేసారు. తెలంగాణ లోనూ పలు కీలకశాఖలను పర్యవేక్షిం చారు. పదవీ విరమణ చేసారు. రేవంత్ కు సన్నిహిత అధికారిగా పేరున్న సీనియర్ కావటంతో ఇప్పుడు సీఎంఓలో కీలక బాధ్యతలు అప్పగించారు.ఈ పదవి లో ఆయన రెండేళు కొనసాగనున్నారు. ఇక సీఎంముఖ్య కార్యదర్శిగా శేషాద్రిని కంటిన్యూ చేస్తారని చెబుతున్నారు. సీఎంకార్యదర్శి మాణిక్ రాజ్ కీలక శాఖల్ని పర్యవేక్షిస్తున్నారు. సీఎంకు సన్నిహితంగా ఉండే అజిత్ రెడ్డి ప్రత్యేక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

# ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

మొదటి పేజీ తరువాయి

వినోద రంగానికి చెం దిన సీఈఓలు,పరిశ్రమలకి చెందిన ప్రము ఖులు హాజరు కానున్నారు. ఈ సదస్సును ప్రధాని మోదీ గురువారం ప్రారంభించగా, కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని.. ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ వివరించారు. గత వందేళ్లలో భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకి కూడా చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటు-లు అమితాబ్ బచ్చన్ , రణ్‌బీర్ కపూర్ , దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్ సహా ఇతర ప్రపంచ తారలు పాల్గొన్నారు. అయితే రజనీకాంత్, మోహన్ లాల్, హేమ మాలిని, చిరంజీవి, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, మోహన్ లాల్ కలిసి ఓ గ్రూప్ ఫొటో దిగారు. ఈ పిక్ ఎంతగానో ఆకట్టు-కుంది. చాలా రోజుల తర్వాత ఆ నాటి సీనియర్ హీరోలు అందరు కలిసి ఇలా ఫోటో దిగగా, ఇప్పుడు ఈ పిక్ నెట్టింట వైరల్ అవుతుంది. అలనాటి స్టార్స్ ఇలా ఒకే గ్రూప్ పిక్‌లో చూడడం చాలా ఆనందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బుధవారమే చిరంజీవి ఈ కార్యక్రమం కోసం హైదరాబాద్ నుంచి ముంబయి చేరుకున్నారు. ఆయనకి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. వేవ్స్ సమ్మిట్‌కి చిరు చాలా సింపుల్‌గానే వెళ్లారు.

# దూకుడు పెంచిన ఎసిబి

ఏప్రిల్‌లో రికార్డుస్థాయిలో 21 కేసులు

**హైదరాబాద్,నీలగిరివార్త :**

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. అవినీతి, అక్రమాస్తుల విషయాల్లో కేసుల నమోదుతో దూసుకెళ్తుంది. కేవలం ఒక్క ఏప్రిల్ నెలలో మొత్తం 21 కేసుల నమోదు అయ్యాయి. 13 ఏసీబీ ట్రాప్ కేసులు, 2 అక్రమాస్తుల కేసులు, 2 క్రిమినల్ దుష్ప్రవర్తన కేసులు, 2 ఆశ్చర్యపరిచే తనిఖీ కేసులు, 2 సాధారణ కేసులు చేసినట్లు- ప్రకటించింది. 20 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్, రిమాండ్ చేయబడ్డారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

NEELAGIRI VARTHA TELUGU DAILY
neelagirivartha@gmail.com
నీలగిరి వార్త
తెలుగు దిన పత్రిక
మన కోసం మన వార్త
తెలంగాణ ఉమ్మడి జిల్లాలు
శుక్రవారం
2-5-2025




# తెలంగాణ బోనాల జాతరకు ముహూర్తం ఫిక్స్!

## గోల్కొండ బోనాలతో పాటు పాతబస్తీ లాల్‌దర్వాజా బోనాలు

## సికింద్రాబాద్ బోనాల తేదీలను కూడా ప్రకటన



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి. నీలగిరివార్త

తెలంగాణా బోనాల జాతరకు ముహూర్తం ఫిక్స్ .చారిత్రక గోల్కొండ బోనాలతో పాటు పాతబస్తీ లాల్‌దర్వాజా బోనాలు, సికింద్రాబాద్ బోనాల తేదీలను కూడా ప్రకటించారు.మరో రెండు నెలల్లో ఈ బోనాల సంబరాలు మొదలు కానున్నాయి.తెలంగాణ ప్రజలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుపుకునే పండుగల్లో బోనాలు ఒకటి.రాష్ట్ర పండుగ అయిన బోనాల పండుగ తేదీలను పరిశీలిస్తే చారిత్రక గోల్కొండ కోట శ్రీజగదాంబిక అమ్మవారి బోనాలు జూన్ 26వ తేదీన ప్రారంభమై జూలై 24వ తేదీతో ముగుస్తాయి.

ఇక సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు జూలై 13న, లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాలు జూలై 20న జరగనున్నాయి. గతేడాది గోల్కొండ బోనాలలో 25 లక్షల మంది భక్తులు పాల్గొనగా, ఈసారి ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.జూన్ 26వ తేదీ గురువారం మొదటి బోనం, 29వ తేదీ ఆదివారం రెండవ బోనం, జూలై 3వ తేదీ గురువారం మూడవ బోనం, 6వ తేదీ ఆదివారం నాల్గవ బోనం, 10వ తేదీ గురువారం ఐదవ బోనం, 13వ తేదీ ఆదివారం ఆరవ బోనం, 17వ తేదీ గురువారం ఏడవ బోనం, 20వ తేదీ ఆదివారం 8వ బోనం, 24వ తేదీ గురువారం 9వ బోనం నిర్వహించనున్నారు.

# వచ్చే విద్యా సంవత్సరానికైనా సర్కార్ బడులను బాగు చేయండి.?

## శిథిలాయస్థకు చేరిన కలకోవ ప్రాథమిక పాఠశాల భవనం

## అసంపూర్తిగా మిగిలిపోయిన కలకోవ పాఠశాల నూతన భవనం

మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార్త:ఏప్రిల్ 30





మునగాల:మండల పరిధిలోనికలకోవ గ్రామ ప్రభుత్వ సర్కారు పాఠశాలల్లో పలుచోట్ల తరగతి గదులు సరిపడా లేక ఉన్న గదులు శిధిలావస్థకు చేరి నూతన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో శిధిలావస్థలో ఉన్న భవనాలు ఎప్పుడు గులిపోతుందో తెలియక ఉన్న విద్యార్థులు ఉపాధ్యాయులు నానా ఇబంధులు పడుతున్నారు, అనంతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించారు ఆ భవనం శిధిలావస్థకు చేరింది.వాయిల సింగారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్న పనులు ముందుకు సాగడం లేదు, కొత్త గోల్ తండా ప్రాథమిక పాఠశాల కొన్ని గదులు శిధిలవస్థకు చేరుకోవడంతో విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. త్రిపురవరం ప్రాథమిక పాఠశాల కొన్ని గదులు శిధిలావస్థకు చేరుకోవడంతో ఉన్న గదులతో విద్యా బోధన నెట్టుకొస్తున్నారు. అమీనాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొన్ని పాత గదులు శిధిలవస్థకు చేరుకున్నాయి, అనంతగిరి ప్రాథమిక పాఠశాల నూతన భవనం పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్న పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. గిరిజన సంక్షేమశాఖ హాస్టల్లో గదులను వినియోగిస్తూ విద్యా బోధన చేస్తున్నారు. అజ్మీర తండ ప్రాథమిక పాఠశాల కొన్ని గదులు శిధిలవస్థకు చేరుకొని సరిపడా గదులు సక్రమంగా లేవు ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని పాఠశాలలో ఇదే పరిస్థితి నెలకొని ఉన్నదని మండలప్రజలుఆవేదన వ్యక్తంచేస్తున్నారు.నాయకులు అధికారులు వచ్చే విద్య సంవత్సరానికి చదువుకునే విద్యార్థులపై దృష్టి సారించి ఆగి ఉన్న నూతన భవనాలు శిధిలవస్థకు చేరిన భవనాలు నిర్మించి అన్ని రకాల వసతులు కల్పించి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని విద్యార్థి తల్లిదండ్రులు ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# దేశవ్యాప్తంగా ప్రభుత్వం కుల గణన నిర్ణయం తీసుకోవడం స్వాగతించారు..ప్రభుత్వ విప్

నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి



వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ పట్టణం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్న సందర్భంగా దేశంలో ఉన్న అసమానతలు తొలగించి కుల గణన చేయాలని సంకల్పించారు దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేయడం జరపడం జరిగింది.అసెంబ్లీలో ఆమోదం తెలిపి కేంద్ర ప్రభుత్వానికి పంపి దానిని చట్టంగా మార్చి షెడ్యూల్ నైన్ లో చేర్చాలని కోరడమైనది నేడూ రాహులు గాంధీ పోరాటం రేవంత్ రెడ్డి ఆలోచన దేశా వ్యాప్తంగా కుల గణన చేయాలని సంకల్పించారు నేడు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ విజయంగా భావిస్తున్నాం కుల గణన చేయడం ద్వార మన రాష్ట్రం దేశానికి ఒక రోల్ మోడల్ గా నిలుస్తుంది వెనుకబడిన వర్గాల లెక్క తేల్చి వారికి ఉద్యోగ విద్య రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాలని భారత్ జూడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ సంకల్పించారు బిసి బిడ్డగా తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పొన్నం ప్రభాకర్ ప్రవేశా పెడితే బలపరిచే అవకాశం నాకు లభించింది ఎన్ని అడ్డంకులు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో కూల గణన నిర్వహించి బీసీ ల సంఖ్య 56.36 శాతంగా లెక్క తేల్చారు బీసీ బిడ్డలు గా రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలుపుతున్నాం కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి షెడ్యూల్ నైన్ లో చేర్చాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. జంతర్ మంతర్ వద్ద ధర్నా లో వివిధ పార్టీల ఎంపీలు వచ్చి మద్దతు తెలిపారు. దేశంలోనే పాలు రాష్ట్రాల్లో కుల గణన చేస్తానని పలు రాష్ట్ర ప్రభుత్వాలు తీర్మానించాయి దేశంలో కూల గణనపై జరుగుతున్న ఒత్తిడి తట్టుకోలేక బిజెపి ప్రభుత్వం దానికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం జరిగింది తప్పని పరిస్థితుల్లో బీజేపీ ప్రభుత్వం దిగి వచ్చింది. బీజేపీ బిఆర్ఎస్ వారు మేము చేసినా కుల గణన పే తపుడు ఆరోపణలు చేశారు ప్రతి దాన్ని రాజకీయ కోణంలో చూడటం మానుకోవాలి రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు పోతాం అని తెలిపారు.

# అటవీ అధికారులు లంచాల మత్తులో 1/70 చట్టం అభాసుపాలు...

- గిరిజనేతరులు అడవుల సాగుతో..పర్యావరణానికి హాని...
- కంప నిధుల ఖర్చుల వివరాల పై అవినీతి మరకలు...
- ఆర్ వో ఎఫ్ ఆర్ పట్టాల పంపిణీలో ఫోర్జరీలతో అటవీ సాగు...
- అడవుల్లో చెక్ పోస్టుల పేరుతో అక్రమ సంపాదన..
- పనికి ఓ రేటు..అంటున్న అవినీతి అటవీ అధికారుల నిఘా కరువు...
- పెత్తందారుల చేతుల్లో...బానిసలైన గిరిజనుల బ్రతుకులు...
- అటవీ అధికారుల తీరుతో వన్యప్రాణులకు, గిరిజనులకు అన్యాయం...
- అటవీ అధికారుల కుటుంబ సభ్యుల పేర్ల పై వందలాది ఎకరాలు కజ్జా...




బ్యూరో ఇంచార్జీ (కంచర్ల నాగేశ్వరరావుగౌడ్ ) : నీలగిరి వార్త

గిరిజనేతరులు అడవుల సాగులో అక్రమంగా వ్యవసాయం చేస్తూ,అటవీ ప్రాంతాలను నాశనం చేస్తున్నారు.వారు అటవీ భూములను సాగులోకి తెస్తున్నారని,పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు.గిరిజనేతరులు అటవీ భూములను అక్రమంగా సాగులోకి తెస్తుండటం గిరిజన సమాజంలో ఆందోళన కలిగిస్తోంది.రాజకీయ నాయకుల ప్రోద్బలంతో రెవెన్యూ అధికారులు గిరిజనేతరులకు రిజర్వ్ ఫారెస్ట్‌లో పట్టాలు జారీ చేస్తున్నారని,ఇది అటవీ శాఖ అధికారులకు తెలియకుండానే జరుగుతోందన్నారు.

గిరిజనేతరులు అటవీ భూములను కొని,గిరిజనుల పేరిట భూములు కొనుగోలు చేస్తారని,ఇది అక్రమమని తెలిసినప్పటికీ బరితెగింపుతో, అటవీశాఖ అధికారుల సహకారంతో గిరిజనేతరులు యదేచ్ఛగా అడవులను ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు.గిరిజనేతరుల అక్రమ సాగు వల్ల పర్యావరణం నాశనం అవుతోందని,ఇది అడవులకు, పర్యావరణానికి హానికరం అని గిరిజనులు వాపోతున్నప్పటికీ అటవీ శాఖ అధికారుల విధినిర్వహణలో లంచాల మత్తుతో ఆవగింజంతైన మార్పు రాకపోవడం శోచనీయం. అడవుల సంరక్షణ కొరకై మరిన్ని వివరాలతో పరిశీలిస్తే...

భారతదేశంలోని అటవీ భూములలో మరియు వాటికి దగ్గరగా లక్షలాది మంది నివసిస్తున్నారు,కానీ వారి ఇళ్ళు,భూములు లేదా జీవనోపాధి పై వారికి చట్టబద్ధమైన హక్కు లేదు.కొంతమంది ప్రభుత్వ అధికారులకు అడవులు మరియు అటవీ నివాసులపై పూర్తి అధికారం ఉంది.ఫలితం..? అడవులు మరియు ప్రజలు ఇద్దరూ మరణిస్తున్నారు.ఈ చట్టం అటవీ నివాసుల హక్కులను గుర్తిస్తుంది మరియు పరిరక్షణను మరింత జవాబుదారీగా చేస్తుంది.భారతదేశంలోని అటవీ ప్రాంతాలలో,ప్రజలు ప్రజాస్వామ్యం,జీవనోపాధి మరియు గౌరవం కోసం పోరాడుతున్నారు.షెడ్యూల్డ్ తెగలు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసులు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం,2006 ఆ పోరాటంలో ఒక సాధనం..

ఈ చట్టం ప్రతి గిరిజన కుటుంబానికి 4 హెక్టార్ల భూమిని పంపిణీ చేస్తుంది.ఈ చట్టం భారతదేశంలోని అడవులన్నింటినీ నాశనం చేస్తుంది.ఈ చట్టం ద్వారా ప్రజలు అడవులను ఆక్రమించి నాశనం చేస్తారు.ప్రతి చట్టాన్ని దుర్వినియోగం చేస్తారు మరియు దీనిని భూ కబ్జాకు ఉపయోగిస్తారు.ఈ చట్టం అడవుల నుండి అన్ని రక్షణలను తొలగిస్తుంది.జాతీయ ఉద్యానవనాలు మరియు అభయారణ్యాలలో ప్రజలను ఉండడానికి అనుమతించడం ద్వారా,ఈ చట్టం వన్యప్రాణులను – ముఖ్యంగా పులులను – రక్షించడం అసాధ్యం చేస్తుంది."అటవీ పెంపకం" అంటే చెట్ల పెంపకం,ఇవి వాస్తవానికి పర్యావరణానికి హానికరం, ఎందుకంటే అవి విభిన్న సహజ పర్యావరణ వ్యవస్థలను ఒకే చెట్టు స్టాండ్‌లతో భర్తీ చేస్తాయి. అంతేకాకుండా,అవి తరచుగా ప్రజల భూములు లేదా గ్రామ అడవులలో చేయబడతాయి మరియుహాఫలితంగా ప్రజలను స్థానభ్రంశం చేసి వారి హక్కులను కోల్పోతాయి.ప్రస్తుతానికి,ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాల కోసం భారీ మొత్తంలో డబ్బును వెచ్చిస్తోంది,ఇది వాస్తవానికి ప్రజలకు మరియు అడవులకు ముప్పు కలిగిస్తుంది.పులులు భారతదేశ జాతీయ జంతువు.కానీ వాటిని అత్యంత జవాబుదారీగా,పారదర్శకంగా మరియు సమర్థవంతంగా రక్షించే బదులు,అటవీ అధికార యంత్రాంగం తనకు తానుగా మరిన్ని అధికారాలను చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది.

2006లో,భారత ప్రభుత్వం యొక్క టైగర్ టాస్క్ ఫోర్స్,పులుల హక్కులను ఉల్లంఘించడం అన్యాయం మరియు పులులకు ప్రమాదకరం అని ఎత్తి చూపిన తర్వాత,పులుల ఆవాసాలను శాస్త్రీయంగా నిర్ణయించడం మరియు ఈ ప్రాంతాల నుండి ప్రజలను పునరావాసం కల్పించడం వంటి సమతుల్య ప్రక్రియను అందించడానికి వన్యప్రాణుల (రక్షణ)చట్టాన్ని సవరించారు.ప్రభుత్వం కట్టుబడి ఉందా..? లేదు.అటవీ బ్యూరోక్రసీ వారిని అనుమతించలేదు.బదులుగా,అది మళ్ళీ భూ కబ్జాకు దిగి,ప్రజలను మరియు పులులను ప్రమాదంలో పడేసింది...( పైన పేర్కొన్న ప్రతి లీడ్ ,సబ్ లీడ్ పై పక్కగా ఆధారాలతో త్వరలో ప్రచురణకు సిద్ధం)...

# కార్మికుల సమష్టి పోరాట ఫలితమే మే డే

**ఎన్ని సమస్యలు ఎదురైనా మొదటి ప్రాధాన్యత పార్టీ కార్యకర్తలకే**

**పార్టీ కార్యకర్తల కష్ట కాలంలో అండగా ఉంటా**

**యూనియన్ కార్యాలయాన్ని వచ్చే మేడే వరకు మీటింగ్ హాల్ పూర్తిచేస్తా**

**యూనియన్ కార్యాలయం మీటింగ్ హాల్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే**

**దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

దేవరకొండ నీలగిరి వార్త





ప్రపంచ కార్మిక మే డే దినాన్ని పురస్కరించుకొని నేడు దేవరకొండ పట్టణ కేంద్రంలో ఐఎన్టీయూసీ 327 అధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని ఐ ఎన్ టి యు సి జెండా ఆవిష్కరించి,కార్మిక సోదరులందరికీ మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ ప్రగతి ఫలాలు అన్ని వర్గాలకు చేరుతున్న వేళ కార్మికుల జీవితాల్లో సరికొత్త వెలుగులు విరజిల్లాలని ఆకాంక్షించారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ ముందు వరుసలో ఉంటుందన్నారు.ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల దినంగా జరుపుకుంటున్న కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపడం జరిగింది.19వ శతాబ్దంలో కార్మికుల హక్కుల కోసమే పోరాడిన ఈ రోజు వారి జ్ఞాపకంగా జరుపుకుంటున్నాం అన్నారు.మే డే కార్మికుల హక్కులను గుర్తిస్తూ ప్రభుత్వం వారికి అండగా ఉంటుంది అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా,పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్,శిరందాస్ కృష్ణయ్య,మండల పార్టీ అధ్యక్షులు లోకాసాని కృష్ణయ్య,మాజీ ఎంపీపీలు గోవింద్ యాదవ్, బిక్కు నాయక్, సీనియర్ నాయకులు తిపార్థి రుక్మా రెడ్డి,పాప నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్,యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, ఐ ఎన్ టి యు సి 327 సంఘం డివిజన్ కార్యదర్శి నిరంజన్ అలీ, డివిజన్ అధ్యక్షులు రవి కుమార్,మాజీ పట్టణ కౌన్సిలర్ మురళీ కృష్ణ, ఇలియాస్, విద్యుత్ కాంట్రాక్టర్ సంతోష్ కుమార్, అశోక్,మాజీ ఎంపీటీసీ మహా లక్ష్మయ్య,నారయ్య,రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన తహశీల్దార్ సునీతా ఎలిజబెత్

ముదిగొండ నీలగిరి వార్త మే 1.

ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో సయ్యద్ ఇషాద్ మరియు షేక్ సోందుమియా మెమోరియల్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మండలాల వారీగా ఏర్పాటు చేసిన టోర్నమెంట్ కి ముఖ్య అతిథిగా పాల్గొన్న తహశీల్దార్ సునీతా ఎలిజబెత్ ఈ సందర్భంగా యువకులతో తొలి బాల్‌ను బాట్‌తో ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభించారు తహశీల్దార్ క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహసంబంధాలు పెరు గుతాయని, ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మళ్లీ గెలిచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పహల్గాం ఉగ్ర దాడి మృతులకు నివాళులు అర్పించి 2 నిమిషాలు మౌనం పాటించారు ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు మరియు దాతలు ప్రథమ బహుమతి 20,000/- రూ, ద్వితీయ బహుమతి 12,000/- సయ్యద్ రిజ్వాన్ - నహేద తృతీయ బహుమతి గడ్డం రాధ జ్ఞాపకార్థం గడ్డం శ్రీనివాస్ టెంట్ హౌస్ 10,000/-, బెస్ట్ బ్యాట్స్ మెన్,బౌలర్ షీల్డ్స్ దాత గడ్డం మల్లిఖార్జున్ (సాయి కౌశల్ డిజిటల్స్) వాటర్ దాత మారుతి సురేష్ జాహ్నవి డ్రింకింగ్ వాటర్,సౌండ్ సిస్టం నక్కని అనిల్ కుమార్, కానిస్టేబుల్ అబ్దుల్ ఖలిక్ గ్రామ మాజీ సర్పంచ్ వాకదాని కన్నయ్య,ఉప సర్పంచ్ మైసయ్య, సమాజ సేవకులు మహ్మద్ ఖాసిం బాబు, గ్రామ పెద్దలు నబీ సాహెబ్, సయ్యద్ రఫీ,ఊరుకొండ రాజు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ మురళీ కృష్ణ,మహేష్ రెడ్డి సీనియర్ క్రికెటర్లు సయ్యద్ నాగుల్ మీరా, అల్లాడి ప్రసాద్,షేక్ హైమద్, తదితరులు పాల్గొన్నారు.



# మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

**విద్యార్థుల్లో ఎల్లవేళలా పోరాడే తత్వం ఉండాలి**

**ప్రతి విద్యార్థి ఓటమిని పాఠంగా స్వీకరించాలి**

**తక్కువ మార్కులు వచ్చాయని ఎప్పుడు కూడా కుంగిపోవద్దు**




ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన మునుగోడు నియోజకవర్గ విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలిపి సన్మానించిన మునుగోడు శాసనసభ్యులు శ్రీ.కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి . ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మునుగోడు నియోజకవర్గానికి చెందిన విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలిపి సన్మానించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి .మునుగోడు నియోజకవర్గం లో ని చండూరు, నాంపల్లి మండలాలలో గాంధీజీ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థిని విద్యార్థులకు ఉమ్మడి నల్గొండ జిల్లా మొదటి ర్యాంకులు వచ్చాయి.ఈ పాఠశాలలో చదివి 590/600 మార్కులు సాధించిన అమూల్య శ్రీ తో పాటు విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.విద్యార్థిని విద్యార్థులకు శాలువాలు కప్పి మెమెంటో లను అందజేశారు..ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎల్లవేళలా పోరాడే తత్వం ఉండాలని, ఒకసారి తక్కువ మార్కులు వచ్చాయని కుంగిపోకుండా అనునిత్యం పోరాడుతూనే ఉండాలని, ప్రతి విద్యార్థి ఓటమిని పాఠంగా స్వీకరించాలన్నారు. మునుగోడు ఉ ప ఎన్నికల్లో ఓటమి చెందానని ఇంట్లోనే కూర్చుంటే మళ్ళీ ఇప్పుడు ఎమ్మెల్యేగా తాను గెలిచే వాడిని కాదని ఉదాహరిస్తూ తక్కువ మార్కులు వచ్చాయని ఎప్పుడు కూడా కుంగిపోవద్దని ముమ్ముందు బాగా చదివి ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపాడు.

ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ కోడి శ్రీనివాస్, గాంధీజీ స్కూల్ సిబ్బంది,ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# మంభోజిపల్లిలోని ఆలయం వద్ద భక్తుల కోరికలు నెరవేర్చిన ఇలవేల్పు మల్లన్న స్వామి



నీలిగిరి వార్త:మెదక్ జిల్లా బ్యూరో:మే 01:

మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామ పంచాయతీ శివారు ప్రాంతంలో గల కొయ్యగుట్ట వద్ద వెలిసిన మల్లన్న స్వామిని దర్శించుకోవడానికి ప్రతి ఆదివారం కాకుండా ప్రతిరోజు చాలా దూర ప్రాంతాల నుండి గాని పరిసర ప్రాంతాల నుండి గాని భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మల్లన్న స్వామిని దర్శించుకుంటే చేసిన పాపాలను తొలగించుకొని పుణ్యాలను ఇలవేల్పు మల్లన్న దేవుడు సహకరిస్తా రని భక్తులు కోరిన కోరికలను కొంగుబంగారంగా మల్లన్న స్వామి దేవుడు ఆశీర్వదించి ఎల్లవేళలా సుఖ సంతోషాలతో జీవనం కొనసాగించుకోవాలని కోరిన కోరికలు నెరవేర్చు కొనుటకు స్వామివారికి బోనాలు సమర్పిస్తారు.అలాగే స్వామివారికి మొక్కిన కోరికలను అన్నింటిని తీర్చుకుంటారు.మల్లన్న స్వామి వారి దగ్గరకు వచ్చిన భక్తులందరూ తమ ఆపదలకు,ఇబ్బందులకు గురికాకుండానే మల్లన్న స్వామి వద్ద మొక్కులు తీర్చుకునేందుకు వచ్చి ఇలవేల్పు మల్లన్న స్వామిని దర్శించుకొని పోతే అనుకున్న పనులు అవుతాయని చాలా నమ్మకం కలిగిందని భక్తులు సంతోషంగా ఉంటామని చెప్పారు.

# ఇందిరాఅనాధ వృద్ధాశ్రమంలో రుచి ఫ్యామిలీ రెస్టారెంట్ సహకారంతోవాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదవితరణ




మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార్త: మే1

మునగాల:కోదాడవాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మునగాల మండల పరిధిలోని ఉన్న ముకుందాపురం గ్రామంలోని ఇందిరా అనాధ వృద్ధాశ్రమంలో వృద్ధులకు హైదరాబాద్ వాస్తవ్యులు జల్లా నరసింహమూర్తి జన్మదిన సందర్భంగా (రుచి ఫ్యామిలీ రెస్టారెంట్) సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు సేకు శ్రీనివాసరావు మాట్లాడుతూ, పుట్టినరోజు వేడుకలను ఇలాంటి వృద్ధాశ్రమాలలో జరుపుకోవడం అభినందనీయమని నరసింహమూర్తికి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు సేకు శ్రీనివాసరావు, సెక్రటరీ పత్తి నరేందర్, కోశాధికారి వెంపటి ప్రసాద్, డిపిఓలు బండారు శ్రీనివాసరావు, ఇమ్మడి సతీష్ బాబు ,ఉపాధ్యక్షులు బండారు సాంబశివరావు, సభ్యులు హరిప్రసాద్, ఆశ్రమ కోఆర్డినేటర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా స్వీట్స్, డ్రైఫ్రూట్స్ పంపిణీ

నీలగిరి వార్త కోదాడ సూర్యాపేట జిల్లా...



గురువారం నాడు మే డే సందర్భంగా పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోదాడ లోని స్థానిక శ్రీ లక్ష్మీ వాసు సూపర్ మార్కెట్లో పనిచేస్తున్న సిబ్బంది లీల, కుమారి, నాగమణి ,రేష్మ లకు డ్రై ఫ్రూట్స్ మరియు స్వీట్స్ అందజేసి మే డే శు భాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెస్ విద్యాసంస్థల సీ.ఈ.వో మరియు పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారు ఎస్.ఎస్ రావు. ఈ సందర్భంగా ఎస్.ఎస్ రావు మాట్లాడుతూ కార్మికులకు వారి కష్టానికి తగిన ఫలితాన్ని అందజేయాలని కోరారు. ప్రపంచ కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పరిశ్రమలు కార్మికులను చేసే శ్రమ దోపిడీని నివారించాలి

**టి ఎన్ యు సి ఆధ్వర్యంలో ర్యాలీ, జండా ఆవిష్కరణ**

**కార్యక్రమంలో పాల్గొన్న టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి**






నీలగిరి వార్త,హుజూర్ నగర్

పరిశ్రమలు కార్మికులను చేసే శ్రమ దోపిడిని ప్రభుత్వాలు నివారించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు మండవ వెంకటేశ్వర్లు గౌడ్ కోరారు.

గురువారం మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని మిర్యాలగూడ రోడ్డు కూడలి,పరిశ్రమల ప్రాంతం నుంచి ప్రదర్శన నిర్వహించి కోదాడ రోడ్డు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద టి ఎన్ యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి జండా ఆవిష్కరణ చేశారు.

ఈ సందర్భంగా టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి మాట్లాడుతూ అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని,ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని,పరిశ్రమల వారిని డిమాండ్ చేశారు.అనంతరం శ్రమ జీవులఅందరికీ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు కోమ్మగాని వెంకటేశ్వర్లు గౌడ్,గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి రాములు, గరిడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కీసరి నాగయ్య ముదిరాజ్, మఠంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ నాగేశ్వర నాయక్,నల్లగొండ పార్లమెంటు నాయకులు పోలగాని సురేష్ గౌడ్,మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కె మస్తాన్,ఆవులపాటి శ్రీను,తిరుమలగిరి గోవిందు,బ్రహ్మయ్య,తిరుమలగిరి తిరుమలి,కొమ్మరాజు అంజయ్య,పట్టణ టి ఎన్ యు సి అధ్యక్షుడు గుండెబోయిన ఎంకన్న యాదవ్,కోటమ్మ,స్వరూప, సామ్రాజ్యం,జక్కుల కిరణ్,గొల్లగోపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జగదీష్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి

**ప్రవర్తన మార్చుకోకపోతే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారు**

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**



నీలగిరి వార్త, సూర్యాపేట:-

జగదీష్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, లేనట్లయితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి రాష్ట్ర ఇరిగేషన్ , సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను వ్యవసాయ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం సూర్యాపేట లో జరిగిన మీడియా సమావేశంలో వేణారెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. నోటికి వచ్చినట్టు మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారని, జగదీష్ రెడ్డి సూర్యాపేటలో తిరగకుండా అడుగడుగునా నిరసనలు తెలియజేస్తామని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి చరిత్ర తెలుసుకోకుండా జగదీష్ రెడ్డి అనుచితమైన వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. జగదీష్ రెడ్డి జీవితచరిత్ర అందరికి తెలుసని, హుజూర్ నగర్ లో డిపాజిట్ కోల్పోయి, సూర్యాపేట కు వచ్చి అదృష్టం బాగుండి, ఎమ్మెల్యే గా గెలిచి, మంత్రిగా పనిచేసి వేల కోట్లు సంపాదించారని, గత ఎన్నికలలో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసి గెలిచారని అన్నారు. కెసిఆర్ లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడు సంవత్సరాలకే క్రుంగి పోయిందని, 32 కోట్లతో జగదీష్ రెడ్డి కట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎందుకూ పనికిరాకుండా పోయిందని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సైన్యం లో పనిచేసి మిగ్ విమానాలు నడిపారని, రాష్ట్రపతి కి సెక్యూరిటీ ఆఫీసర్ గా పనిచేశారని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరు సార్లు ఎమ్మెల్యే గా, ఒకసారి ఎంపిగా, పిసిసి అధ్యక్షులు గా పనిచేశారని, అటువంటి నాయకుని మీద జగదీష్ రెడ్డి చులకన చేస్తూ మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని, 8066 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందని ఆయన అన్నారు. సహకార సంఘాల ద్వారా 5049 కేంద్రాలు, ఐకెపి ల ద్వారా 2464 కేంద్రాలు, ఇతర కేంద్రాలు 553 ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. రాష్ట్రంలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండించారని, అందులో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, 35 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వడ్లు, 35 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు వడ్లు కొనుగోలు చేశామని, సన్న ధాన్యానికి క్వింటాల్ కు 500/- బోనస్ గా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. పేదలు కూడ సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, సన్న బియ్యం తీసుకుని పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

# ఘనంగా మేడే వేడుకలు

**ప్రపంచ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి**

మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార: మే 1

మునగాల:ప్రపంచకార్మికుల దినాన్ని పురస్కరించుకొని గురువారం మునగాల మండలకేంద్రంలో మునగాల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖఅధ్యక్షులు కొమ్ము ఈదారావు అధ్యక్షతన ఐఎన్టీయూసీ అధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో ఐ.ఎన్.టి.యు.సి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్ల పాటి శ్రీనివాసరావు, ఐ.ఎన్.టి. యు.సి.జిల్లాఅధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి, లు జెండా ఆవిష్కరించి,కార్మిక సోదరులందరికీ మే డే శుభాకాంక్షలుతెలియజేశారు.

ఈ సందర్భంగామాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వ ప్రగతి ఫలాలు అన్ని వర్గాలకు చేరుతున్న వేళ కార్మికుల జీవితాల్లో సరికొత్త వెలుగులు విరజిల్లాలని ఆకాంక్షించారు.కార్మికులసమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ ముందు వరుసలో ఉంటుం దన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కుల దినంగా జరుపుకుంటున్న కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపడం జరిగింది.19వ శతాబ్దంలో కార్మికుల హక్కుల కోసమే పోరాడిన ఈ రోజు వారి జ్ఞాపకంగా జరుపుకుంటున్నాం అన్నారు.మే డే కార్మికుల హక్కులను గుర్తిస్తూ ప్రభుత్వం వారికి అండగా ఉంటుంది అన్నారు.ఈకార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్లకోటయ్య, కొలిశెట్టి బుచ్చి పాపయ్య, మాతంగి బసవయ్య, భీమపంగు శంకర్, జిల్లాపల్లి వెంకటేశ్వర్లు, మట్టయ్య, పచ్చిపాల శ్రీనివాస్, శెట్టి గిరి, ఎండి రషీద్, గుండు నాగేశ్వరరావు,తదితరులుపాల్గొన్నారు.





# జగతి ఉన్నంతవరకు ఎర్రజెండా ఉంటది

నీలగిరి వార్త /మే 1/నల్గొండ జిల్లా ప్రతినిధి :శంకర్




జగతి ఉన్నంతవరకు ఎర్రజెండా ఉంటదని, ఒక కమ్యూనిస్టు లక్ష మందితో సమానమని, నోటుకు బిర్యానీ ప్యాకెట్ కు అమ్ముడుపోని వారే నిజమైన కమ్యూనిస్టులని ఎమ్మెల్సీ ప్రజా గాయకుడు గోరేటి వెంకన్న అన్నారు. మే డే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా మిర్యాలగూడలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి శకుంతల థియేటర్ బస్టాండు మీదుగా రాజీవ్ చౌక్ వరకు కోలాటాలు, బాణసంచులు కాల్చుతూ భారీ ప్రదర్శన చేశారు. రాజీవ్ చౌక్ వద్ద జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎర్రజెండా అంటేనే పేదల పార్టీ అని నిరంతరం పేదల కోసం పోరాటాలు ఉద్యమాలు చేస్తుంటుందని అలాంటి పార్టీలో కార్యకర్తలుగా పనిచేయడం నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ఒక్కొక్క కార్యకర్త లక్ష మందితో సమానమని చెప్పారు. కొన్ని పార్టీలు నోట్లు బిర్యానీ ప్యాకెట్ ఇచ్చి జన సమీకరణ చేసి గొప్పలు చెప్పుకుంటారని కానీ కమ్యూనిస్టు పార్టీ సభలకు మాత్రం ప్రజలు స్వచ్ఛందంగా వస్తారని తెలిపారు. ఎర్రజెండాను చూస్తేనే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతాయన్నారు. ప్రజలు ఉన్నంతవరకు వారి సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా పనిచేస్తుందని తెలిపారు. ఎప్పటికైనా ఈ సమాజానికి ఎర్రజెండా అవసరం ఉంటుందని కమ్యూనిస్టు పార్టీ ప్రత్యామ్నాయమని చెప్పారు. అనంతరం పాటలతో ఉత్తేజపరిచారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో 80 శాతం మంది ప్రజలు పేదరికంతో అల్లాడుతున్నాయని పాలకులే ఈ విషయాన్ని పదే పదే గుర్తు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు .మే డే స్ఫూర్తితో పాలకుల విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు తిరుపతి రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లె వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రవి నాయక్ డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, భావాండ్ల పాండు, సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర, సత్యనారాయణరావు,గాదె పద్మ, పాదూరి శశిధర్ రెడ్డి, వినోద్ నాయక్, రేమిడల పరశురాములు రాగిరెడ్డి మంగారెడ్డి, వరలక్ష్మి,ఆయూబ్, సీతారాములు, అంజాద్, ఆయా కార్మిక సంఘాల నాయకులు బీఎం నాయుడు, కోడి రెక్క మల్లయ్య, శ్రీను, వేణు, రాంచంద్రు, శ్రీనివాస్ రెడ్డి, పిల్లుట్ల సైదులు, అరుణ, గోవర్ధనా, మాధవరావు కార్మికులు పాల్గొన్నారు.

# మండవ శాంతిబాబు కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటాం

**కలకోవ గ్రామీణఉద్యోగులసంఘం అధ్యక్షులు: అనంతు లక్ష్మణ్**



మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార్త: మే1

మునగాల:మండల పరిధిలోనికలకోవ గ్రామానికి చెందిన మండవ.శాంతి కుమార్ ఇటీవల అనారోగ్యంతో ఆకస్మిక మరణం చెందడం జరిగింది. అంతేకాక తన భార్య కూడా 8 నెలల క్రితం అనారోగ్యంతో మరణించడంతో వారికి ఉన్న ఏకైక కూతురు మండవ. కార్తిక. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగలడంతో ఆ కలకోవ గ్రామఉద్యోగులసంఘం స్పందించి, లక్షా యాభై వేల ( 1,50,000 )రూపాయలను విరాళంగా ఆ పాప ( కార్తీక ) పేరు మీద, ఆ పాప నాయనమ్మ పార్వతమ్మ, ను గార్డియన్ గా ఫిక్స్డ్ డిపాజిట్ చేసి అట్టి పేపర్స్‌ను, బుధవారం రోజున గ్రామఉద్యోగసమాఖ్యఅధ్యక్షులు అనంతు.లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి బుర్రి. ప్రవీణ్.కోశాధికారి చిర్ర.రాజేంద్రప్రసాద్. రిటైర్డ్ జిహెచ్ఎం బొగ్గారపు.రామ్మూర్తి గౌరవ అధ్యక్షులు బుర్రి. శ్రీనివాసరావు.సభ్యులు మండవ. విజయ, మంగమ్మ, మణెమ్మ.అమరగాని. సరిత.సుంకరి సురేష్. అనంతు.శివతేజ ఎస్సై. ముదిగొండ శ్రీనివాసరావు, సురభి శేఖర్,చేతుల మీదుగ మండవ కార్తీక,కు అందజేశారు, ఈకార్యక్రమంలోకుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లి తాజా మాజీ జడ్పీటీసీ ఏవి రెడ్డికి మాతృవియోగం

**సంతాపం వ్యక్తం చేసిన పలువురు ప్రముఖులు**




నీలగిరివార్త /మే 1/నల్గొండ జిల్లా ప్రతినిధి:శంకర్

నాంపల్లి తాజా మాజీ జెడ్పిటిసి ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి తల్లి ఎలుగోటి నరసమ్మ(105) సంవత్సరాలు తమ స్వగ్రామమైన పసునూరి గ్రామంలో పరమపదించారు ఏవి రెడ్డిని పలువురు ప్రముఖులు పరామర్శించారు వారిలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీకర్నె ప్రభాకర్, ఏవి రెడ్డి యువసేన సభ్యులు రాగిపణి ధనంజయ్ చారి, ఎస్కే అబ్బాస్, దండిగా సాలయ, చల్లా సైదిరెడ్డి, వెంకన్న, శేఖర్ తదితరులు ఉన్నారు.

# ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సన్మానం



దేవరకొండ నీలగిరి వార్త

దేవరకొండ పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్ అప్పర్ ప్రైమరీ స్కూల్ కరస్పాండెంట్ చెరిపెల్లి రాజేష్ రమ్య ల కుమార్తె చెరిపెల్లి ప్రణతి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 462/470 మార్కులు సాధించడం పట్ల పట్టణానికి చెందిన తెలంగాణ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి ( ప్రింట్ మీడియా అదనపు బాధ్యతలు) ముసిని అంజన్ గురువారం శాలువాతో ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులైన రాజేష్ రమ్యలను అభినందిస్తూ భవిష్యత్తులో విద్యార్థిని మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

# సీఎంకి కృతజ్ఞతలు తెలిపిన జాజుల లింగం గౌడ్



నీలగిరి వార్త/ మే1/ నల్గొండ జిల్లా ప్రతినిధి :శంకర్

దేశవ్యాప్తంగా కులగలను చేయాలని బీసీ సంఘాలు చేసిన పోరాటానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్కి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శాలువతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కుల గణన చేస్తామని ప్రకటించడంతోజాజుల లింగం గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.

# మెడికల్ హెల్త్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**

**మెడికల్ అండ్ హెల్త్**

**ఐఎన్ టియుసి -3194 ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు**





నీలగిరి వార్త, సూర్యాపేట:-
మెడికల్ హెల్త్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారికి ఎల్లవేళలా అండగా వుంటానని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. తాళ్లగడ్డలోని మెడికల్ హెల్త్ అసోసియేషన్ ఐఎన్ టియుసి 3194 యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఐఎన్ టియుసి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ పాలనలో మెడికల్ హెల్త్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొని యూనియన్ కార్యాలయం కాపాడుకుంటూ, బిఆర్ ఎస్ సంఘాల నాయకుల ఆగడాలను అడ్డుకుని ధైర్యంగా నిలిచారని అన్నారు. మెడికల్ హెల్త్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, సంబంధిత అధికారులతో మాట్లాడుతానని అన్నారు. ప్రతి సంవత్సరం మెడికల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగే మేడే వేడుకలలో మాజీ మంత్రి , సూర్యాపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి పాల్గొనేవారని, ఈ సంవత్సరం కొంత అనారోగ్యం కారణంగా వారు రాలేకపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టియుసి 3194 యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి యూనియన్ నాయకులు పనులపై వెళితే అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని, గతంలో బిఆర్ ఎస్ పాలనలో బిఆర్ ఎస్ నాయకులు చెప్పినట్లు అధికారులు పనిచేశారని, ఇప్పుడు మాత్రం ప్రతి పనికి రూల్స్ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కక్కిరేణి శ్రీనివాస్, చింతమల్ల రమేష్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, నాగుల వాసు, పందిరి మల్లేష్, గండూరి రమేష్, ఆలేటి మాణిక్యం, చెంచల నిఖిల్, నర్సయ్య యాదవ్, సంజయ్, యూనియన్ జిల్లా అధ్యక్షులు మనోజ్ రెడ్డి, దేశగాని పాపయ్య గౌడ్, సముద్రాల సూరి, శ్రీనివాస్, రాజ్ కుమార్, చంద్రశేఖర్ రాజు, రమేష్, ప్రేమ్ కుమార్ , సైదులు,వెంకటరమణ, పద్మ, వీరమ్మ, సుభద్ర, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# భర్తను కోల్పోయిన నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

- మానవత్వాన్ని చాటుకున్న న్యాయవాదులు ఎన్ హెచ్ ఆర్ సి దాతలు
- న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎన్ హెచ్ ఆర్ సి
- ప్రేమలత భర్త అమృతి ఇటీవలే మృతి
- పేదరికంతో పిల్లలకు పోషణ భారంగా మారిన వైనం
- నలుగురు పిల్లలతో జీవనాన్ని కొనసాగించలేకపోతున్న ప్రేమలత
- చిన్నారులను సాకలేక ఆదుకోనమని దాతలు కోరిన ప్రేమలత
- ప్రేమలత తల్లి సైతం మృతి
- చెల్లెలు సహాయంతో వృద్ధుడైన తండ్రి సాయంతో విలవిలలాడుతున్న ప్రేమలత
- ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసిన
- గ్రామస్తులు యువ న్యాయవాది జున్ను దయ

దేవరకొండ నీలగిరి వార్త






విధి వెక్కిరించింది తాళి కట్టిన భర్త కలకాలం తోడుంటాడని తలంచింది.. విధి చేసిన నాటకంలో జీవితకాలం తోడుంటానన్న భర్త అకాలంగా మృతి చెందారు. అప్పటికే ఆమెకు నలుగురు పిల్లలతో తల్లి గారి ఇంటి దారి పట్టింది. వృద్ధాప్యంతో ఉన్న తండ్రి మృతి చెందిన తల్లి , కుమార్తె దీనగాథను చూసి తల్లడిల్లి పోతున్నారు. దయనీయమైన సంఘటన చందంపేట మండలంలోని పోలేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కాసారం గ్రామానికి చెందిన గుర్జుగాళ్ళ అమృతి కి ప్రేమలతను ఇచ్చి వివాహం చేశారు. ఇటీవల నెల క్రిందట భర్త మృతి చెందారు. దిక్కుతోచని స్థితిలో ప్రేమలత తన చిన్నారులను తీసుకొని తల్లిగారిల్లు అయిన పోలేపల్లికి చేరుకుంది. కనీసం తినడానికి పట్టెడు బియ్యం కూడా లేని స్థితిని ఇదే గ్రామానికి చెందిన న్యాయవాది నాగిళ్ల దున్నిద్దయ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో తన వంతుగా 5000 రూపాయల ఆర్థిక సాయం అందించి వారికి బాసటగా నిలవాలని నిర్ణయించుకున్నారు. తన సీనియర్ అయినటువంటి న్యాయవాది ఎండి షౌకత్ అలీ కి తెలియజేశారు. తాను సైతం తన మిత్రుల ద్వారా 20 వేల రూపాయలను అందించడానికి కృషి చేశారు. ఇదే విషయమై దేవరకొండ ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా ద్వారా మరో కొంత నగదును సేకరించడంతోపాటు 50 కేజీల బియ్యం నిత్యవసర వస్తువులు బుధవారం ప్రేమలత కుటుంబానికి అందించారు. వివిధ గ్రామాల నుండి ప్రజా ప్రతినిధులు అందించిన సుమారు 50 వేల రూపాయల నగదును అందించారు. చిన్నారులైన పిల్లలపై ఫిక్స్ డిపాజిట్ చేయనున్నట్లు జున్ను దయ తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎండి షౌకత్ అలీ, యువ న్యాయవాది నాగిళ్ల జున్నుద్దయ్య, ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా, మునిని అంజన్, అల్తాఫ్ , బండి నరేష్, గార్లపాటి శ్రీను, అరుణ్ ,పిల్లి మహేష్, రామకృష్ణ ,హరి ప్రసాద్, చేపూరి నరేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపురూప సమ్మేళనం



**1982- 83 దేవరకొండ గర్ల్స్ హై స్కూల్ ఎస్ఎస్సి బ్యాచ్**

**42 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై స్నేహితుల ఆత్మీయ సమ్మేళనం**

**1982 -83 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు పాఠశాలకు 50,000 రూపాయల విలువగల సౌండ్ బాక్స్ అందజేత**

దేవరకొండ నీలగిరి వార్త
చిన్నతనంలో చదువుకున్న పాఠశాల స్నేహితులను కలుసుకోవాలని ఒకటి కాదు రెండు కాదు 42 సంవత్సరాల తర్వాత ఆత్మీయంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని దేవరకొండ పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ 1982 -83 ఎస్ ఎస్ సి బ్యాచ్ విద్యార్థులు గురువారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆనాటి ప్రధానోపాధ్యాయురాలు అయినా ప్రమీల, పిఈటి వనం చంద్రమౌళి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు రేబాక లను




ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థులం కలుసుకోవాలని తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించుకోవాలన్న కార్యక్రమాన్ని 42 ఏళ్ల తర్వాత వీలు పడిందని తెలిపారు . ఈ ఆనందానికి అవధులు లేవని తామంతా సీనియర్ సిటిజన్స్ గా మారిపోయామని అయినా తామ స్నేహితులను కలుసుకోవడంతో తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల , పి ఈ టి వనం చంద్రమౌళి, పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు రేబాక, మిర్యాకులు కే జయరెడ్డి, ఎండి రాబియా బేగం, సముద్రాల అరుణ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. చదువుకున్న పాఠశాలకు రిటర్న్ గిఫ్ట్ గా 1982 -83 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 50 వేల రూపాయల మైక్ సౌండ్ సిస్టంను పాఠశాలకు అందించారు.

# వాటర్ సప్లై వర్కర్స్ సేవలు మరువలేనివి



నీలగిరి వార్త, సూర్యాపేట:-
మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నిత్యం నీటి సరఫరా చేస్తున్న వాటర్ సప్లై వర్కర్స్ సిబ్బంది సేవలు మరువలేనివని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. వేసవికాలంలో కూడ సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డులలో నీటి కొరత రాకుండా సమన్వయం చేసుకుని, నీటి ట్యాంక్ లను నింపుతూ, ప్రజలకు నీటి సరఫరా చేస్తున్న మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది కి మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. సూర్యాపేట పట్టణంలోని వాటర్ వర్క్స్ కార్యాలయం నందు జరిగిన మేడే వేడుకలలో కొప్పుల వేణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐఎన్ టియుసి జెం డాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చెరకు వేణు, కార్యదర్శి గుండా నాగరాజు, కోశాధికారి పటాని శ్రీనివాస్, సయ్యద్ సమి, దుబాయ్ శ్రీను, సురేందర్ రాజు, సంద్రబోయిన వెంకన్న, నిరంజన్ రెడ్డి, వేణు, అర్వపల్లి, నాగమణి, సోమమ్మ, ఝాన్సి, శాంత తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

**కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎన్ టి యు సి నేతలు.**





నీలగిరి వార్త.హుజూర్ నగర్
సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో మేడే ప్రపంచ కార్మిక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.పట్టణంలో ఏర్పాటు చేసిన వివిధ సంఘాల ఐ ఎన్ టి యు సి జండాలను మిల్లు డ్రైవర్స్ యూనియన్,సివిల్ సప్లై, ఆటో యూనియన్,ఎస్ డబ్ల్యూ సి యూనియన్,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్,మున్సిపల్ వర్కర్స్ యూనియన్,జెండాలను రాష్ట్ర ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ ఎగురవేశారు.అనంతరం పట్టణంలో ఆటో కార్మికులతో ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ అనంతరం పొట్టి శ్రీరాములు సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఐ ఎన్ టి యు సి నాయకులు పాల్గొని ప్రసంగించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ రావు స్వాగత ఉపన్యాసం చేయగా సభకు అధ్యక్షత వహించిన ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ కార్యక్రమ పర్యవేక్షకులుగా,నియోజకవర్గం అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, మేళ్లచెరువు ముక్కంటి,రామరాజు యాదవ్,మాజీ సమితి అధ్యక్షుడు సాముల శివారెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్,మాజీ గ్రంథాలయ జిల్లా చైర్మన్ అల్లం ప్రభాకర్ రెడ్డి,పీసీసీ సభ్యులు దొంగరి వెంకటేశ్వర్లు, ఈడుపుగంటి సుబ్బారావు,గొట్టె వెంకట్రామయ్య, మాజీ జడ్పిటిసి గల్లా వెంకటేశ్వర్లు,చిట్యాల అమర్నాథ్ రెడ్డి, మేకల నాగేశ్వరరావు,అట్లూరి హరిబాబు, కుక్కడపు మహేష్ గౌడ్ లు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎరగాని నాగన్న గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నేతృత్వంలో హుజూర్ నగర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో రాష్ట్రంలోనే మొదటి వరుసలో నిలిచిందని, పేదలకి,బడుగు,బలహీన వర్గాలకి ఉపయోగపడే అనేక కార్యక్రమాలు పేదలకు ఇండ్లు,సన్నబియ్యం,వైద్య సదుపాయం,విద్యాసదుపాయం, వీటన్నిటి ద్వారా కార్మిక కుటుంబాలు మరింత బలపడుతున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో చప్పిడి సావిత్రి, ఎరగాని గురవయ్య,మేకపోతుల వెంకయ్య,యరగాని భిక్షం,చలిగంటి జానయ్య,కందుల వెంకన్న,నాగేందర్ కేశరాజు గోపి,భీమయ్య,శాంతారాజ్యం, సీత,పల్లె క్రాంతి,జాన్ సైదా,చీమట్ట, సైదులు,నరసింహారావు,వీరబాబు,ఏదుల నరసింహారావు,ముస్తఫా,శ్రీనివాస్,ఎస్ రాజు,కత్తుల రవీందర్,ముశం సత్యనారాయణ, కోల మట్టయ్య,తోట లక్ష్మయ్య,లచ్చిమల్ల నాగేశ్వరరావు,దిల్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిపిఐ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు

దేవరకొండ నీలగిరి వార్త
దేవరకొండలో ఘనంగా 139వ మేడే ఉత్సవాలను నిర్వహించడం జరిగింది మేడే సందర్భంగా పడమటి పల్లి, కొండ భీమనపల్లి, ఎల్లారెడ్డిభావి, ఇద్దంపల్లి, జిల్లపల్లి, పాత్లవత్ తండా,గొట్టిముక్కల, తెలుగుపల్లి, తూర్పుపల్లి, దేవరకొండ పట్టణంలోని ఆర్టీసి డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్, మార్కెట్ యార్డ్ సివిల్ సప్లై అమాలి సంఘం వద్ద,భవన నిర్మాణ, తాపీ మేస్త్రీల అడ్డా, వివిధ హమాలీ సంఘాల అడ్డాల వద్ద సిపిఐ, ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరించి లిఅనంతరం సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం పల్లా పర్వత్ రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ 1886 అమెరికా దేశంలోని చికాగో నగరంలో 8 గంటల పని 8 విశ్రాంతి ఎనిమిది గంటల వినోదం కోసం జరిగిన పోరాటంలో అమరులైన కార్మికుల రక్తంతో తడిసిన ఎర్రజెండా నేటికీ ప్రపంచవ్యాప్తంగా ఎగురుతుందని కార్మికుల పోరాడాలతో ఎరుపెక్కిన జెండా పెట్టుబడుదారులు కార్పొరేట్ వ్యాపారుల ప్రభుత్వాల మీద పోరాటాలు చేసి ఎన్ని హక్కులు సాధించుకోవడం జరిగిందని భారత దేశ స్వాతంత్రం పోరాటంలో కార్మికుల ముందుండి పోరాడారు అని స్వాతంత్రానికి పూర్వమే కొన్ని చట్టాలు పోరాడి సాధించుకోవడం జరిగిందని సాధించుకున్న చట్టాలు నేడు అధికారంలో బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో 44 కార్మిక



చట్టాలను 29 చట్టాలను నాలుగు కోడలుగా చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా తయారు చేశారని కనీస వేతన చట్టం పిఎఫ్ చట్టం ఈఎస్ఐ చట్టం గ్రాటివిటీ బోనస్ చట్టాలను పూర్తిగా మార్చాలని ఆయన అన్నారు ఎర్రజెండా నాయకత్వంలో మరిన్ని పోరాటాలు చేసి ప్రభుత్వాల మీద ఉద్యమాలు నిర్వహించి హక్కులు సాధించుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ,ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు,ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ కార్యదర్శి జూలూరు వెంకట్రాములు,మండల కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు పార్టీ ప్రజాసంఘాల బాధ్యులు పల్లా రంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పులిహోర మజ్జిగ ,పంపిణీ

నీలగిరి వార్త కోదాడ సూర్యాపేట జిల్లా...

వాసవి క్లబ్ కోదాడ వారి ఆధ్వర్యంలో కోదాడ వాస్తవ్యులు ఆర్యవైశ్య నాయకులు రాయపూడి వెంకట నారాయణ తన తల్లిదండ్రులు రాయపూడి నాగేశ్వరరావు ఉదయలక్ష్మిల జ్ఞాపకార్థం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, గర్భిణీ స్త్రీలకు ,ఆశా వర్కర్లకు మే డే ని పురస్కరించుకొని 200 మందికి పైగా పులిహోర మజ్జిగ. పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి.పి.సి.సి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి హాజరై ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న వాసవి క్లబ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు సేకు శ్రీనివాసరావు, సెక్రటరీ పత్తి నరేందర్, కోశాధికారి వెంపటి ప్రసాద్, ఐ.పి.సి చల్లా విజయ శేఖర్, డి.పి.ఓ బండారు శ్రీనివాసరావు ,ఉపాధ్యక్షులు గుడుగుంట్ల సాయి,



సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు, యాతాకుల మధు, పలువురు పాల్గొన్నారు...

# ఘనంగా మేడే ఉత్సవాలు

**కమ్యూనిస్టుల పోరాట ఫలితమే మేడే పనిచేసిన ప్రతి కార్మికుడికి సమాన వేతనం ఇవ్వాలి**

**సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కామ్రేడ్ బుర్రి శ్రీరాములు**

మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార్త: మే 1
మునగాల:కార్మికులుపోరాటాల ద్వారానే కార్మిక హక్కులను సాధించుకుంటారు,పోరాటం చేయకుండా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాదని అందుకు కార్మికులు కర్షకులు కలిసి పోరాడాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, సీఐటీయూ జిల్లా కమిటీసభ్యులు బచ్చలకూర స్వరాజ్యం,అన్నారు. గురువారం సిఐటియు, సిపిఎం పార్టీఆధ్వర్యంలో వివిధ సెంటర్లలో కార్మిక సంఘాల జెండాలను ఎగురవేసి మేడిన ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా సిపిఎంపార్టీమండల కార్యదర్శి కామ్రేడ్ బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ,అమెరికా చికాగో నగరం లో లక్షలాదిమంది కార్మికులు కంపెనీల యజమానుల వ్యతిరేకంగా రోజుకు 18 గంటల పని దినాలకు వ్యతిరేకంగా 8 గంటల పని దినాలకై పోరాడి ప్రాణాలర్పించిన రోజు అని అన్నారు.సీఐటీయూ జిల్లాకమిటీసభ్యులు బచ్చలకూర స్వరాజ్యం మాట్లాడుతూ, లక్షలాది మంది కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బిజెపి కేంద్ర ప్రభుత్వం చట్టాలను రద్దు పరచి బడా పెట్టుబడుదారులకు ఉపయోగపడే విధంగా 4 లేబర్ కోడ్ లను తీసుకువచ్చి 12 గంటల పని దినాలకు పెంచే ప్రయత్నం చేస్తున్నారని కార్మికులకు నష్టదాయకం చేసే చట్టాలను అమలు చేయాలని చూస్తున్నారు వీటికి వ్యతిరేకంగా ఈనెల 20న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తసమ్మెకుపిలుపునివ్వడం జరిగినది,ఈసమయంలో కార్మికులు కర్షకులుపాల్గొని సమ్మెనుజయప్రదంచేయాలని పిలుపునిచ్చారు,ఈక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జె విజయలక్ష్మి చందాచంద్రయ్య,స్టాలిన్ రెడ్డి,కృష్ణారెడ్డి, సైదులు, లింగయ్య ,గోపయ్య, నాగయ్య,వెంకట్ రెడ్డి,సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు షేక్ దస్తగిరి, నాగేంద్రబాబు, పాషా మేస్త్రి, నాగరాజు, వెంకటేశ్వర్లు, మైసయ్య గౌడ్, అంజయ్య,జానయ్య, నాగయ్య, రవి, పరశురాములు, రఘు,తదితరులుపాల్గొన్నారు.





# కేజీబీవీ విద్యార్థినుల సత్తా వర్షశ్రీ, మానస టాపర్లు



భిక్కనూర్ (రాజంపేట) మే 1 (నీలగిరి వార్త)

రాజంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో అద్భుత ప్రతిభను ప్రదర్శించి మండల స్థాయిలోనే టాపర్లుగా నిలిచారు. గుర్రాల వర్షశ్రీ 552 మార్కులతో మొదటి స్థానం, తాండూరి మానస 549 మార్కులతో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. మొత్తం 333 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 329 మంది ఉత్తీర్ణత సాధించి మండలాన్ని గర్వపడేలా చేశారు. ఉత్తీర్ణత శాతం 98.79గా నమోదు అయింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ అందాల రమేష్ వారిని ప్రత్యేకంగా సత్కరించారు. విద్యార్థులకు శాలువాలు కప్పి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, బయట కల్చర్ బాగోలేదు. హాస్టల్లో ఉండి పిల్లలు చదువుకోవాలి. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వారికి మద్దతుగా ఉండాలి, అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి శ్రీవాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. టాపర్ల విజయంతో విద్యాలయం మరియు మండలంలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది.

# ఏఐటీయూసీ మరియు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు






నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గుమ్మి.పుల్లయ్య భవన్లో 139 వ మేడే ను పురస్కరించుకొని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి.రాములు ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు.అలాగే మున్సిపల్ వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి జెండా ఎగురవేయడం జరిగింది.అలాగే లేబర్ అడ్డావద్ద జెండాను ఎగురవేయడం జరిగింది.ఈ సందర్భంగా కడారి.రాములు మాట్లాడుతూ 139 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి కార్మికుల బ్రతుకులు మారడం లేదని 8 గంటల పనివిధానం అమలు కావడం లేదని కనీస వేతనాలు నేషనల్ పే స్కేల్ చెప్పిన విదంగా అమలు జరగడం లేదని కాంట్రాక్టు అని ఔట్ సోర్సింగ్ అని ప్రజాస్వామ్యం లోనే దోపిడీ చేస్తున్నారని ఈ విధానాలు మారాలని అన్నారు .కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను మార్చి 4 కోడ్ లుగా మార్చడాన్ని మానాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ సీపీఐ పార్టీ కార్యదర్శి గాజుల పోశెట్టి రూరల్ మండలం కార్యదర్శి శ్రీరాముల నర్సయ్య ఎల్ల. దేవరాజు మున్సిపల్ నాయకులు పందుల.మల్లేశం నర్సయ్య కె.వి.అనసూయ పెంట గట్టవ్వ పెంట.భూమవ్వ వాల్మీకి.ఊర్మిల సైకిల్.పుష్పలత పెంట.రాజవ్వ పెంట.నరేష్ పెంట మల్లేషం బిగుళ్ల.మల్లేశం సుంకపాక.పర్శరాం కోరేపు.క్రాంతి కోరేపు.శ్రీను కళ్లెపెల్లి నర్సయ్య పండుగ పోచమల్లు పండుగ చంద్రయ్య తదితర కార్మిక సంగం నాయకులు పాల్గొన్నారు.

# టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగు సమ్మెను జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:



టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ కామారెడ్డి డిపో ఆధ్వర్యంలో ఈనెల మే 7 తేదీన మొదటి డ్యూటీ నుండి జరుగు సమ్మెను జయప్రదం చేయాలని పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అడిషనల్ సెక్రెటరీ వెంకట గౌడ్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలియం చేయాలని, ట్రేడ్ యూనియన్ లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, 2017 సంవత్సర వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, కొత్త అలవెన్సు అమలు చేయాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు 2017 వేతన సవరణ జరిగి అన్ని బకాయిలు చెల్లించాలని, 2021,2025 వేతన సవరణలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సిబ్బందిపై అధిక పని భారాలు తగ్గించాలని, ఎంటి డబ్ల్యూ యాక్టును అమలు చేయాలనీ, బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ కారణంగా నిరపారాదులైన డ్రైవర్లను శిక్షించరాదని , వారిని వైద్య పరీక్షలకు పంపాలని, మహాలక్ష్మి పథకం అమలు జరిగే తప్పులకు సిబ్బందిని అక్రమంగా శిక్షించరాదని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం ప్రభుత్వం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు కొని ఆర్టీసీకి ఇవ్వాలని, కారుణ్య నియామకాలు రెగ్యులర్ ప్రతిపాదన కింద పని చేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని అదే బస్సుల మరియు ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లను ఇతర సిబ్బందిని ఆర్టీసీలోనికి తీసుకోవాలని 2019 సమ్మె కాలంలో ఉద్యోగులపై నమోదు చేసిన పోలీస్ కేసులను ఎత్తివేయాలని, పిఎఫ్, సిసిఎస్ నుండి యజమాన్యం వాడుకున్న డబ్బులను వాటితో సహా చెల్లించాలని, ఔట్సోర్సింగ్ మరియు కాంటాక్ట్ పేరు మీద పనిచేస్తున్న అధికారులను సూపర్వైజర్లను తొలగించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో వెంకట్ గౌడ్ మూర్తి, బాలాగౌడ్, శేఖర్ ,ప్రేమ్ కుమార్, గిరి, బుచ్చిరెడ్డి, అంజయ్య, శ్యామ్ ,డిపో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మోదీ చిత్రపటానికి పాలాభిషేకం.. బీజేపీ శ్రేణుల సంబరాలు

**కుల గణన ద్వారా వెనుకబడిన వర్గాలకు మెరుగైన సంక్షేమ పథకాలు అభివృద్ధి అవకాశాలు**





నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్
కార్యక్రమానికి ముందు అంబేద్కర్ విగ్రహ కు పూలమాల వేసి వారి రాజ్యాంగ స్ఫూర్తితోనే దేశంలోని జనాభా లెక్కలతో పాటు కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం నాడు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సిసిపిఎ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలో బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ పట్టణ బిజెపి అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు సంబరాలు జరిపారు. ప్రధాన మంత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ కేంద్ర నిర్ణయాన్ని హర్షించారు ఇది సామాజిక న్యాయం దిశగా ముందడుగు అని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డారు. కుల గణన ద్వారా వెనుకబడిన వర్గాలకు మెరుగైన సంక్షేమ పథకాలు అభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు దోహద పడుతుందంటూ నేతలు తెలిపారు దేశ అభివృద్ధిలో ప్రతిఒక్కరివూ సమాన భాగస్వామ్యం ఉండాలన్న ప్రధాని నరేంద్ర మోదీ దృక్పథానికి ఇది ప్రతిబింబమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రేగుల మల్లికార్జున్ గుడిసె మనోజ్ అన్నం నర్సయ్య మహంకాళీ శ్రీను గంటి కనకయ్య బిల్లా కృష్ణహరి జవ్వాజి శేఖర్నామాల శేఖర్ కోరేపు నరేష్ రేగు ల శ్రీకాంత్ గడ్డమిది శ్రీనివాస్ మెరుగు లక్ష్మణ్ వివేక్ రెడ్డి నేరెళ్ళ సాయి మంత్రి రమేష్ పొత్తూరి వెంకటేశ్ రఘుపతి హరీష్ గౌడ్ యశ్వంత్ బుర్ర మనీష్ తడుక రాజు పట్టణ కమిటీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హమాలి కార్మిక సంఘు కార్యాలయం ఎదుట "మేడే " సందర్భంగా జెండాను ఆవిష్కరించిన పొలాస నరేందర్



పొలాస నరేందర్ గౌరవ అధ్యక్షులు మండల హమాలి కార్మిక సంగం వేములవాడ

నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

139 ఏండ్ల "మేడే" అంతర్జాతీయ కార్మిక దినోత్సవం శుభ సందర్భంగా వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్డులోని మండల హమాలి కార్మిక కార్యాలయం ఎదుట మండల కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు పొలాస నరేందర్ మేడే పతాకాన్ని ఆవిష్కరించారు.

పతాకావిష్కరణ అనంతరం జరిగిన సమావేశంలో కార్మికుల నిద్దేశించి పొలాస నరేందర్ మాట్లాడుతూ అమెరికాలోని చికాగో పట్టణంలో కార్మికులు 18 గంటల పనిధినాన్ని వ్యతిరేకిస్తూ 8 గంటల పని కావాలని జరిపిన ప్రదర్శనపై అమెరికన్ పోలీసులు జరిపిన కాల్పుల్లో 8 మంది కార్మికులు బలైనారని చికాగో కార్మికులు ఉద్యమించిన రోజున అంతర్జాతీయ "మేడే దినోత్సవాన్ని కార్మికులు జరుపుకోవడం జరుగుతుందని సంఘటిత అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన చట్టాలు చట్టబద్ధంగా సంపూర్ణంగా శాస్త్రీయంగా పటిస్టవంతంగా అమలు జరగడం లేదని నిబంధనల ప్రకారం 5 ఏండ్ల కొకసారి సవరణ జరగాల్సి ఉన్న కార్మికుల చట్టాలను సవరణ చేయకుండా పాత చట్టాలనే అమలు చేస్తున్నారని పాత కార్మిక చట్టాలకు స్వస్తి చెప్పి కొత్త చట్టాలను చట్టపరంగా శాస్త్రీయంగాసంపూర్ణంగా అమలు చేసి సంఘటిత అసంఘటితరంగ కార్మికులకు న్యాయం చేయాలని మండల హమాలీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు నరేందర్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరారు 5 ఏండ్ల కొకసారి తప్పని సరిగా కనీస వేతన సవరణను ఖరారు చేయాలని కార్మిక చట్టాల్లో ఉన్నప్పటికీ కొత్త చట్టాలను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వాలు పాత చట్టాలనే



అమలు చేస్తూ కాలయాపన చేయడం చాల బాధాకరమని నరేందర్ ఆవేదనను వ్యక్తపరిచారు పెరుగుతున్న రెక్కలు ముక్కలు చేసుకొని,ఎంత శ్రమ పడినప్పటికీ,శ్రమను చెమటగా మార్చినప్పటికి మంచి జీవనాన్ని సాగించలేక పోతున్నారని,వారి పిల్లల భవిష్యత్తుకు మంచి విద్యను, వైద్యాన్ని అందించలేక పోతున్నారని కార్మికులు నిరాశ నిస్పృహకు లోనౌతున్నారని ,వెంటనే పాత కార్మిక చట్టాలకు స్వస్తి చెప్పి,కొత్త చట్టాలను అమలు చేయాలని,అలాగే నిరుపేద కార్మికులకు ఉపాధి,నివేశ స్థలాలను,ఇందిరమ్మ ఇండ్లను ,పెన్షన్లను తక్షణమే మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలను నరేందర్ కోరారు.. "మేడే" పతాకావిష్కరణ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గజ్జెల శేఖర్ ప్రధాన కార్యదర్శి గుండం బాలయ్య సంఘ నాయకులు లింగాపురం పోచమల్లు బేగిని కిషన్ ఎల్పుల ఎల్లయ్య బొడ్డు శేఖర్ చంద్రగిరి నందయ్య,గుండం దాసు అంగులూరి గుణ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో ఆలస్యం దళారుల దందాతో రైతులకు తీవ్ర నష్టం

**విలవిల్లాడుతున్న అన్నదాతలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**



భిక్కనూర్ (రాజంపేట) మే 1 (నీలగిరి వార్త)



రాజంపేట మండలంలో వేల ఎకరాల్లో సాగైన వరి పంట రైతులకు ఈ సీజన్‌లో ఆర్థిక భారంగా మారింది. తక్షణ నగదు అవసరాలతో రైతులు తమ పచ్చి ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితిలో చిక్కుకుపోయారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.1850%-%1950 మధ్య ధర మాత్రమే లభిస్తున్నదిగా రైతులు చెబుతున్నారు. ఇక ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ) రూ.2320గా ఉన్నప్పటికీ, హమామీల కొరత, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొనుగోలు ప్రక్రియ తీవ్రంగా ఆలస్యం అవుతోంది. శివాయిపల్లి, ఆరేపల్లి గ్రామాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తేమశాతం 16% మాత్రమే ఉన్నప్పటికీ, గత పది రోజులుగా కొనుగోలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గోదాముల్లో నిల్వ లేకపోవడం, రవాణా వ్యవస్థ సరిగా లేకపోవడంతో రైతుల ధాన్యం పాళ్లు పెడుతోంది. మోసం చేస్తున్న దళారులు, మిల్లర్లు
ఇక మరోవైపు, రైతుల బలహీనతను ఆసరాగా చేసుకుని దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. రైస్ మిల్లర్లు ఉడికించని ధాన్యాన్ని కల్తీ చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. బాయిల్డ్ రైస్ మిల్లర్లూ తక్కువ ధరకు ధాన్యం సేకరించడంతో రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదు. రైతుల డిమాండ్లు రైతులు ప్రభుత్వాన్ని తక్షణమే స్పందించాలని, కొనుగోలు కేంద్రాలను పునఃప్రారంభించి హమామీలను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. "మా ధాన్యం పది రోజులుగా నిలిచిపోయింది. హమామీలు తక్కువగా ఉండడం వల్ల కొనుగోలు జరగడం లేదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటే కనీస మద్దతు ధర లభించే అవకాశం ఉంటుంది," అని ఒక రైతు నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు. కఠిన చర్యలు తీసుకోవాలి దళారులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకొని పారదర్శక కొనుగోలు విధానం అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సీజన్‌ను ప్రభుత్వం గమనించి సమర్థవంతంగా నిర్వహించకపోతే, రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోతారన్నది విశ్లేషకుల హెచ్చరిక. సూచనలు శివాయిపల్లి, ఆరేపల్లి వంటి గ్రామాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలు పునఃప్రారంభించాలి హమామీలను నియమించి ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి దళారులు, మిల్లర్లపై నిఘా పెంచి, మోసాలను అడ్డుకోవాలి కనీస మద్దతు ధర రైతులకు అందేలా పారదర్శక వ్యవస్థను రూపొందించాలి రైతుల గోడును అధికారులు గుర్తించి, వారి ఆర్థిక భద్రతకు చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చల్మెడ





నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి

వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొమ్ము ఎల్లయ్య తండ్రి కొమ్ము రాజయ్య ఇటివల అనారోగ్యం తో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట సింగిల్ విండో ఛైర్మన్ రామ్మోహన్ రావు బండ నర్సయ్య సీనియర్ నాయకులు చంద్రయ్య గౌడ్ రాఘవ రెడ్డి సత్యనారాయణ రావు నాగుల రాజు శ్రీనివాస్ పర్శరములు గోపాల్ రావు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.ఖ

# భవనం పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

జగ్గయ్యపేట మండలము, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన బండి పసుపు లేటి పూజిత అను ఆమెకి, అదే మండలానికి చెందిన పసుపులేటి సాయికి ఇచ్చి తేదీ 23/8/24 నాడు వివాహం జరిపించగా, వారిద్దరు కూడా కామారెడ్డి అశోక్ నగర్ లో నివాసం ఉంటున్నారు. అయితే గత కొన్ని రోజుల నుండి పసుపులేటి సాయి, వేరే ఒక ఆమెతో ఫోన్లో మాట్లాడుతున్నాడనే విషయం మీద అతని భార్య అయిన పూజిత అతడిని ప్రశ్నించగా, భార్యాభర్తల మధ్యన గొడవ జరిగిందని, అదేవిధంగా వివాహ సమయంలో ఒప్పుకున్న అర ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేసే విషయంలో కూడా గొడవ జరిగిందని, తేదీ 30-4-2025 నాడు రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో తన కూతురు పూజిత, అల్లుడు సాయి ఇద్దరు కూడా ఇదే విషయంలో గొడవ పడినారని, ఆ విషయాన్ని మనసులో ఉంచుకొని, తనని ప్రతి విషయంలో భర్త సాయి ఇబ్బంది పెడుతున్నాడని మనస్థాపం చెంది బిల్డింగ్ పైకి ఎక్కి తనంతట తానుగా గాని లేదా మరేదైనా కారణం చేతగాని, బిల్డింగ్ పైనుంచి కిందపడి తీవ్ర రక్త గాయాలు చనిపోయినట్లుగా, పూజిత తండ్రి అయిన కృష్ణారావు ఇచ్చిన దరఖాస్తుపై, ఆమె భర్త అయిన సాయిపై కేసు నమోదు చేయడం జరిగింది.పోస్టుమార్టం అనంతరం మృతురాలి శవాన్ని అంత్యక్రియల గురించి వారి బంధువులకు అప్పగించడం జరిగింది.

# బీసీల పోరాట విజయం

**దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**

**నీల నాగరాజ్**

**బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో నీల నాగరాజు మాట్లాడుతూ ఆలస్యంగానైనా కులగనణన పై చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని మోడీకి ధన్యవాదాలు. త్వరలో చేపట్టబోయే జనాభా లెక్కల్లో కులగణన కూడా చేపట్టాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నందుకు స్వాగతిస్తున్నామని, ఆలస్యంగానైనా చారిత్రాత్మక నిర్ణయం ప్రకటించినందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపుతున్నామన్నారు.కులగనన చేపట్టాలని,జనాభా దామాష ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని దశాబ్దాలుగా బీసీలు ఉద్యమిస్తున్నారని, ముఖ్యంగా ఏప్రిల్ రెండవ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీల పోరుగర్జన పేరుతో మహాధర్నా చేపట్టడం జరిగిందని,దేశవ్యాప్తంగా వేలాది మంది పాల్గొన్న ఈ ధర్నాకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనడం జరిగిందని,దీనితో కులగనణ డిమాండ్ దేశవ్యాప్తంగా చర్చ జరగడమే కాకుండా,కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచినట్లుగా తాము భావిస్తున్నామని అన్నారు.

ఇదే కాకుండా దేశవ్యాప్తంగా బీహార్, తెలంగాణ రాష్ట్రాలు ఇప్పటికే కులగణన చేపట్టాయని దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా అనివార్యంగా కులగనణ చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు కులాలను రాజకీయంగా వాడుకోకుండా సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు .ఎస్సీ,ఎస్టీ,బీసీ సామాజిక రిజర్వేషన్లకు 50% పరిమితి విధించారని,ఈ కులగణన ద్వారా 50% పరిమితి ఎత్తివేసి,ఎవరి జనాభా దామషా ప్రకారం వారికి రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా దేశవ్యాప్తంగా కులగనణ డిమాండ్ ను జాతీయ స్థాయిలో ఒక ఎజెండా అంశం గా తీసుకొచ్చారని ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.ఇప్పటికైన సామాజిక రిజర్వేషన్ల పై విధించిన 50% పరిమితిని ఎత్తివేసి, తెలంగాణలో 42%, బీహార్ లో 65% రిజర్వేషన్లకు కేంద్రం ఆమొందించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్,రాము పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
మాదక ద్రవ్యాల నియంత్రణకు అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిసిపి అంకిత్ కుమార్ తో కలిసి జిల్లాస్థాయి నార్కో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు కళాశాలల ప్రాంగణాలలో విద్యార్థిని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని రవాణా శాఖలైన రైల్వే, బస్సు స్టాండ్స్ ప్రాంతాల్లో తరచూ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని అన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్ల పైన చిన్న చిన్న గుంతలను పూడ్చి, హెచ్చరిక బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, హైవేలలో స్పీడ్ కంట్రోల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, హైవేలలో రోడ్లకు ఇరువైపుల బ్లాక్ స్పాట్స్ ప్రదేశాలను గుర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అనునిత్యం మత్తు పదార్థాలు రవాణాలో పెట్రోలింగ్ చేయాలని, స్కూల్స్ కాలేజీలలోని విద్యార్థిని విద్యార్థుల ప్రవర్తనను అనుని త్యం తల్లిదండ్రులు టీచర్స్, ప్రధానోపాధ్యాలు గమనించాలని, జూనియర్ డిగ్రీ కాలేజీలలో మత్తుకు బానిస అయితే కలిగే పరిణామాలను విద్యార్థులకు అవగాహన కల్పించాలని డీసీపీ ఈస్ట్ జోన్ అధికారి అంకిత్ కుమార్ సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్డిఓ ఉమారాణి, ఏసీపీ లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాకర్స్ అధ్యక్షులు మిట్టపల్లి హరి ప్రసాద్ అయ్యగారి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




వరంగల్ సిటీ నీలగిరి వార్త.
గురువారం ఏ వి వి కళాశాల కరస్పాండెంట్ కం సెక్రెటరీ డాక్టర్ చందా విజయ్ కుమార్ విశిష్ట అతిథిగా ఆల్ ఇండియా 11 ర్యాంకర్ సాయి శివాని విచ్చేసి ప్రారంభించారు. అనంతరం వాకర్లను ఉద్దేశించి డాక్టర్ చందా విజయ్ కుమార్ మాట్లాడుతూ చలివేంద్రం అనేది ఎండాకాలంలో బాటసారిల దాహం తీర్చడానికి ఉపయోగపడుతుంది అన్నారు. సాయి శివాని మాట్లాడుతూ "మానవసేవే మాధవసేవ" ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అన్నిటికంటే ఉత్తమమైన సేవ అని ప్రతి ఒక్కరూ తమ వంతు సమాజానికి సేవ చేయాలని, మానవ సంబంధాలు పెంచుకోవాలని ఈ మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఏవివి వాకర్స్ను, ఏ వి వి యాజమాన్యాన్ని అభినందిస్తున్నాననీ, ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యం, క్రమశిక్షణ, కఠోర పరిశ్రమ, అంకితభావంతో ఎవరైతే చదువుతారో వారు తప్పకుండా ఉన్నత స్థానంలో ఉంటారని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందా శ్రీకాంత్, వాకర్స్ ప్రెసిడెంట్ సుధాకర్, మనోహర్ బాబు, ధనుంజయ, విశ్వేశ్వర్, వెంకటస్వామి, జంజం కరుణాకర్, రవ్వ శ్రీను, కొమరవెల్లి రవి కుమార్ పూర్ణచందర్, చందా రఘువీర్, వెంకటేశ్వర్లు, సారంగపాణి, సంపత్, శ్రీనివాస్, కుమారస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు, సాయి శివాని తండ్రి ఇట్టబోయిన రాజు, మహిళా వాకర్స్ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా బరపాటి గోపి వ్యవహరించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఇద్దరికీ సామాజిక సేవ శిక్ష, 18 మందికి జరిమానా

వరంగల్ సిటీ నీలగిరి వార్త.
వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ 02 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం 1500/- రూపాయలు జరిమాన విధించినారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 18 మందికి 18,000/- రూపాయల జరిమాన విధించినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ కె .రామకృష్ణ తెలిపారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ జన్మదిన వేడుకలు



ఇల్లందు నీలగిరి వార్త ప్రతినిధి:
ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ జన్మదిన వేడుకలు మండల పరిధిలోని చల్ల సముద్రం గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇల్లందు అభివృద్ధి చెందడానికి మాజీ ఎమ్మెల్యే హరిప్రియ కృషి ఎంతో ఉందని అన్నారు. భవిష్యత్తులో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ అజ్మీర భావ్ సింగ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బండారి శీను, టిఆర్ఎస్ నాయకులు హరిప్రసాద్ యాదవ్, సత్తాల హరికృష్ణ, గిన్నారపు రాజేష్, భూక్య సురేష్ నాయక్, నారాయణ, పూణెం లింగమ్మ, భానోతో రమేష్, సమ్మయ్య, అలెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలియజేసిన మేయర్ గుండు సుధారాణి



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
దేశంలో నిర్వహించే జనాభా లెక్కల్లో భాగంగా కులగణన కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సలహాదారు కేశవ రావు, గ్రేటర్ వరంగల్ మేయర్, మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి జీ హెచ్ ఎం సి మేయర్ గద్వాల విజయలక్ష్మి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, రాజకీయ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున జూబ్లీహిల్స్ నివాసంలోముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డినికలిసిఅభినందనలు తెలియజేశారు.

# మహిళలకు భద్రతతో పాటు సౌకర్యాలు కల్పించాలి

## జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి




ఇల్లందు నీలగిరి వార్త ప్రతినిధి:
మహిళలకు భద్రతతో పాటు సౌకర్యాలు కూడా కల్పించాలని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక అన్నారు. గురువారం స్థానిక ఇల్లందు కోర్టు ఆవరణలో మేడే సందర్భంగా ఇల్లందు మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మేడే అంటేనే ఒక చరిత్రాత్మక దినోత్సవమని పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులు, సమాన పని వేళలు సమాన వేతనం ఉంటాయని ముఖ్యంగా మహిళలు పనిచేసే చోట వారిపై లైంగిక చర్యలకు పాలు పడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని అన్నారు. మహిళలకు పని ప్రదేశాలలో యాజమాన్యాలు భద్రతపరంగా బూట్లు, టోపీలు, హ్యాండ్ గ్లౌజులు మెడికల్ కిట్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంపల్లి ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్, తపాలా సిబ్బంది, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనాభా లెక్కలతో పాటు కులగణన కూడా చేపట్టాలి

## కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షనీయం ఎంపీ రవిచంద్ర



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
దేశవ్యాప్తంగా జనాభా లెక్కలను సేకరించేటప్పుడు, దాంతో పాటుగా కులాల గణనను కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హృదయపూర్వకంగా స్వాగతించారు. ఇది బీఆర్ఎస్ విజయమని, బీసీల ఐకమత్యానికి ఒక ప్రబల నిదర్శనమని వ్యాఖ్యానించారు. అనాదిగా అన్ని రంగాలలో తీవ్ర అన్యాయాలకు, అణిచివేతకు గురవుతున్న బీసీల పక్షాన బీఆర్ఎస్ నిలబడి పోరాటాలు చేసిన ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. తమిళనాడులో బీసీల సంక్షేమం, అభ్యున్నతికి అమలవుతున్న కార్యక్రమాలు, పథకాలను బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఆ రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేయడాన్ని ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో చోటు చేసుకున్న తప్పిదాలను ఎండగడుతూ బీఆర్ఎస్ ఉద్యమించిందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్స్ కల్పించి తీరాల్సిందేనన్న బీఆర్ఎస్ పోరాట ఫలితంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని ఎంపీ రవిచంద్ర చెప్పారు. తమ పార్టీ బీఆర్ఎస్, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మొదటి నుంచి కూడా అణగారిన వర్గాలకు కొండంత అండగా ఉంటున్న సందర్భాలను ఎంపీ రవిచంద్ర ప్రస్తావించారు. రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలినాళ్లలోనే ఎస్సీ రిజర్వేషన్స్ వర్గీకరణకు అనుకూలంగా, చట్టసభలలో మహిళలు, బీసీలకు రిజర్వేషన్స్ కల్పించాలని కోరుతూ తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడమే కాక కేసీఆర్ స్వయంగా ప్రధాని నరేంద్రమోడిని కలిసి వినతిపత్రం అందించడాన్ని.. బీఆర్ఎస్ మంత్రులు, ఎంపీలు పలుమార్లు లేఖలు రాయడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. అలాగే, ఢిల్లీ వేదికగా పలుమార్లు ధర్నాలు చేపట్టి, సభలు, సమావేశాలు నిర్వహించి ఓబీసీల ఐక్యతను దేశానికి చాటి చెప్పామని ఎంపీ వద్దిరాజు వివరించారు. కులగణన చేపట్టే సందర్భంగా ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా, తప్పిదాలు జరుగకుండా పారదర్శకంగా, పకడ్బంధీగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభలలో 33%, తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్స్ అమలునకు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎంపీ రవిచంద్ర ప్రధాని నరేంద్రమోడీని కోరారు. అలాగే, తెలంగాణలో మంత్రివర్గ విస్తరణను వెంటనే చేపట్టి ఖాళీగా ఉన్న ఆరింటిలో నాలుగు పదవులను బీసీలకే కేటాయిస్తూ ప్రాధాన్యత శాఖలు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు.

# మే డే స్ఫూర్తితో పోరాటాలు చేయాలి

## సిపిఎం పార్టీ వరంగల్ జిల్లా కార్యాలయంలో మేడే జెండా ఆవిష్కరణ. ఆవిష్కరించిన పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య.



వరంగల్ సిటీ నీలగిరి వార్త.
మేడే సందర్భంగా ఉరుసుగుట్ట వద్దగల సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయం రామ సురేందర్ భవన్లో పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య మేడే జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వలదాసు దుర్గయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రంగయ్య మాట్లాడుతూ 1886 సంవత్సరంలో చికాగో నగరంలో జరిగిన పోరాటంలో కార్మిక వీరులు చెందిన నెత్తుటి ధారల సాక్షిగా ఎర్రజెండా ఉద్భవించిందని అప్పటినుండి ప్రతి సంవత్సరం మే 1వ తారీఖున కార్మిక దినోత్సవం జరుపుకుంటున్నామని తెలియజేశారు. అప్పట్లో ప్రతి రోజుకు 24 గంటలు కార్మికులు చాకిరీ చేసేవారని విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయడం వల్లనే ఎనిమిది గంటల పని దినం వచ్చిందని అన్నారు. శతాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు అన్ని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతుందన్నారు. కార్మికుల సాధించుకున్న 29 చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చిందని దానివల్ల యాజమాన్యానికి లాభమని కార్మికులు సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును, వేతనాలకై యాజమాన్యాన్ని ప్రశ్నించే హక్కును కోల్పోతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ యాజమాన్యాలకు పరిశ్రమ ఆధిపతులకు లాభం చేకూర్చే విధంగా చట్టాలు మారుస్తుందని వీటిని కార్మికులంతా ఐక్యంగా తిప్పి కొట్టాలని భవిష్యత్తులో కార్మిక హక్కుల కోసం కలిసికట్టుగా పోరాటం చేయడానికి కోరారు.
ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు టిఆర్ఎస్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, కార్మిక నాయకులు మల్లయ్య, ఉదయశ్రీ, స్వాతి, మంజుల, రాజు తదితర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలలో మూడవరోజు



## చతుస్థానార్చన చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు

వరంగల్ సిటీ నీలగిరి వార్త.
వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ రోజుతో మూడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం గం.ఎ 04-00లకు నిత్యాహ్నికం నిర్వహించి చతుస్థానార్చన జరిపి ఉదయం అమ్మవారిని మకర వాహనంపై సాయంకాలం చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు జరిపారు. భవసాగరంలో కొట్టుమిట్టాడుతున్న జీవులను కోరికలు పట్టి పీడిస్తూంటాయని మకర వాహనం మీద సేవిపంబడుతున్న అమ్మవారిని దర్శించడం వల్ల ఈ సంసార సాగరం నుండి తరింపబడతామని అలాగే మన మనస్సును ప్రేరేపిస్తాడు చంద్రుడు. చల్లదనానికి ప్రతీక చంద్రుడు. చంద్రప్రభ వాహనం మీద సేవింపబడుతున్న అమ్మవారిని దర్శించడం వల్ల మనస్సుకు స్వాంతన లభిస్తుంది. స్వాంత చిత్తుడైన జీవుడికి సాధనలో సంపత్తి కలిగి ఇహపర సౌఖ్యాలతో వర్ధిల్లుతాడని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా ఆర్యవైశ్య (పట్టణ) సంఘం, వరంగల్ వారు వ్యవహరించారు. ఈ రోజు కార్యక్రమాలలో పాల్గొన్న ప్రముఖులు ఆర్యవైశ్య సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వర్రావు, ప్రోగ్రాం కన్వీనర్ తొనుపునూరి వీరన్న, మల్యాల వీరమల్లయ్య, అయితా గోపీనాథ్, అల్లాడి వీరభద్రయ్య, గుండా హైమావతి, శ్రీరాం శైలజ తదితరులు పాల్గొన్నారు. పూజానంతరం మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు తదుపరి ఆలయానికి విచ్చేసిన అశేష భక్త జనావళికి దాదాపు వెయ్యి మందికి ఆర్యవైశ్య కులసంఘం వారు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంకాలం గం.ఎ 07-00లకు ఎదుర్కోలు ఉత్సవం (కళ్యాణ రాయబారం) ప్రారంభమైంది. శివకళ్యాణ రాయబారంపై శతావధానప్రభాకర సంస్కృత సరస్వతి మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ దోర్భల ప్రభాకర శర్మ, రామాయంపేట, మెదక్ జిల్లా వాస్తవ్యులు ప్రఖ్యాత సంస్కృత పండితులు సరస భాషణ భూషణులు గోరుగంతు భాస్కరవెంకట సుబ్రహ్మణ్య శర్మ, కొవ్వూరు పశ్చిమ గోదావరి జిల్లా నిర్వహించిన శివకళ్యాణ రాయబార ఘట్టం ఆహూతులను అలరించింది. ఈ ఘట్టాన్ని తిలకించిన భక్తులు కైలాసంలో ఉండి శివపార్వతుల కళ్యాణ రాయబారం నిర్వహిస్తున్న చందంగా ఒక అద్భుతమైన అనుభూతికి లోనయ్యారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.



# జూనియర్ సివిల్ జడ్జిగా వచ్చిన అంకిత్ సర్వని కలిసిన బార్ అసోసియేషన్ న్యాయవాద బృందం



నర్సంపేట నీలగిరి వార్త.
గురువారం రోజున నర్సంపేట కోర్టులో కొత్తగా వచ్చిన జూనియర్ సివిల్ జడ్జ్ కం జ్యూడిషల్ 1%ర్% క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ అంకిత్ సర్వ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కోడిదేల.సంజయ్ కుమార్ కార్యవర్గం మరియు న్యాయవాద బృందం పుష్ప గుచ్చము ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా జడ్జి గారు అందరికి కృతజ్ఞతలు తెలిపి పెండింగ్ కేసులు సత్వర పరిష్కారము చేస్తానని హామీ ఇచ్చారు, కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తండా. సారంగపాని, తోగరు నరసింహారెడ్డి, కొమ్ము రమేష్ యాదవ్, పుట్టపాక రవి, నారగోని రమేష్, సిలువరు కిరణ్ కుమార్, ఠాకూర్ సునీత, అంబటి రాజ్ కుమార్, బోట్ల. పవన్ ఉపాధ్యాక్షులు. కొంగరి. రాజు కోశాధికారి. దాస్యం. రంగనాధ స్వామి, %జుజ% మెంబెర్స్ కంసాని అశోక్, మంకాలి ప్రభాకర్, నాగుల రమేష్, కందకట్ల వీరేశ్, స్రవంతి భూక్య సురేష్ తదిరులు ఉన్నారు.

# హనుమాన్ జంక్షన్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు

## పాల్గొన్న 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి.



వరంగల్ సిటీ నీలగిరి వార్త.
వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ లోని హనుమాన్ జంక్షన్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకలలో స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గారు జెండా ఆవిష్కరించి స్థానికులకు పండ్ల పంపిణీ చేయడం జరిగింది. కార్పొరేటర్ మాట్లాడుతూ "మే డే" సందర్భంగా ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తమ ప్రాణాలను పణంగా పెట్టి మరి ప్రయాణికులను ఎప్పటికప్పుడు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తుంటారు. హనుమాన్ జంక్షన్ కి చెందిన ఆటో డ్రైవర్లు ఎంతో శ్రమకు ఓర్చి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూసుకుంటారు అని తెలియచేస్తూ డ్రైవర్లందరూ క్రమశిక్షణగా ఉండాలని అధికారులతో సఖ్యతగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తో స్థానిక సీనియర్ నాయకులు బిక్షపతి గారు అదేవిధంగా హనుమాన్ జంక్షన్ ఆటో యూనియన్ నాయకులు పసునూరి శ్రీనివాస్, సతీష్ తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రమని గౌరవిద్దాం శ్రమని గుర్తిద్దాం

## 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి.



వరంగల్ సిటీ నీలగిరి వార్త.
వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి గారు స్థానిక డివిజన్లోని సాకరాసికుంట వద్ద స్థానిక సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ శ్రమని గౌరవిద్దాం శ్రమని గుర్తిద్దాం ప్రాంత అభివృద్ధి కోసం డివిజన్ అభివృద్ధిలో పాలు పంచుకుంటున్న మున్సిపల్ కార్మికులకు కార్మిక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గారితో జవాన్లు అస్త్రం శ్రీను ఓరుగంటి జీవన్ సారంగపాణి కిరణ్ కృష్ణ మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

## పొన్నం ప్రభాకర్ రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త



వడ్ల ధాన్యం కొనుగోలు లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతుల అకౌంట్‌లో ధాన్యం డబ్బులు పడేలా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలి. ధాన్యం కొనుగోలులు ఎలాంటి అదనపు తాలు, తూకం పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టవద్దు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏదైనా ఇబ్బందులు సమస్యకు సలహాలు సూచనల కోసం రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0333 కి కాల్ చేసి పిర్యాదు చేయవచ్చని తెలిపారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, రాత్రి వేళ ఇబ్బందులు లేకుండా విద్యుత్ దీపాలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.